నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

మహబూబ్‌నగర్

ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

యూపీఎస్సీ టాపర్ అనన్య రెడ్డికి సీఎం అభినందనలు

నవ తెలంగాణ -మహబూబ్ నగర్



యూపీఎస్సీ సివిల్స్ 2023 టాప్ 3 ర్యాంక్ సాధించిన అంజన్న రెడ్డిని శనివారం ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హను మాన్ అభినందించి శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిప నట్లు దేవరకద్ర శాసనసభ్యులు జి మధుసూదన్ రెడ్డి తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలం పొన్నాకల్ గ్రామానికి చెందిన దోనూరి అనన్య రెడ్డి మరియు వారి కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కలిసినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా అనన్య రెడ్డిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సన్మానించిన, ఐటీ శాఖ మంత్రి . శ్రీధర్ బాబు , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం

నవతెలంగాణ -రాజాపూర్



ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి శ్రీనివాస్ రెడ్డి గారిని గెలిపించుకోవాలని ధ్యర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. బీ రాజాపూర్ మండల కేంద్రంలో జెకె ప్యాలెస్ ఫంక్షన్ హాల్లో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఎలక్షన్లో భాగంగా పాల్గొన్న మహబూ బ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై వారు మాట్లాడుతూ జరగ బోయే పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అఖండ విజయం సాధించాలన్నారు. దాని కనుగుణంగా ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి శ్రీనివాస్ రెడ్డి గారిని గెలిపించుకునే బాధ్యత మన మీద ఉందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రాజాపూర్ మండలంలోని అన్ని గ్రామాల బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు రాజాపూర్ మండలంలో అన్ని గ్రామాల ముఖ్య కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ

- ఇక్కడి నుంచి గెలిచి ఉత్తమ పార్లమెంటు స్థానాన్ని దక్కించుకున్న ఎస్ జైపాల్‌రెడ్డి
- తెలంగాణ ఉద్యమ సమంలో పోటీ చేసి గెలిచిన కేసీఆర్
- మైనార్టీ ఓట్లే కీలకం
- లౌకిక వాదులను గెలిపించాలని చల్లా వంశీచంద్‌రెడ్డి విస్తృత ప్రచారం
- వన్నె తగ్గిన బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి
- బంగ్లా రాజకీయాలు అంటూ... బీజేపీ అభ్యర్థి అరుణపై విమర్శలు



నవతెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పాలమూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలన్న కసితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పటికే ఈ ప్రాంతానికి మూడు సార్లు వచ్చి సభల్లో పాల్గొన్నారు. ఇక్కడి నుండి పోటీ చేస్తున్న వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు రాహుల్‌కు అత్యంత సన్నిహితులు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన కొడంగల్ నియోజకవర్గం ఈ పార్లమెంటు పరిధిలోనే ఉంటుంది. అందుకే వంశీ గెలుపును అత్యంత ప్రతిష్టా త్మకంగా తీసుకున్నారు. గతంలో అనేక మంది జాతీయ నాయకులు ఇక్కడి నుంచి పోటీ చేసి గెలిచారు. 1952లో కే.జనార్ధన్‌రెడ్డి,1957లో రామేశ్వరరావు 1962లో ముత్యాల్ రావు, జాతీయ కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు.1967,1971లో రామేశ్వరరావు టీపీఎస్ నుంచి గెలిచారు.1977లో రామేశ్వరరావు కాంగ్రెస్ నుంచి గెలిచారు.1980లో మల్లికార్జున్‌గౌడ్, 1984లో ఎస్. జైపాల్‌రెడ్డి జనతాపార్టీ నుంచి విజయం సాధించారు. ఆతర్వాత 1989,1991,1996లో వరుసగా కాంగ్రెస్ నుంచి మల్లికార్జున్‌గౌడ్ గెలుపొందారు. ఆతర్వాత 1998లో మరోసారి ఎస్ జైపాల్‌రెడ్డి జనతాపార్టీ నుంచి గెలుపొందారు. 1999లో ఏపీ జితెందర్‌రెడ్డి,బీజేపీ నుంచి పోటీ చేసి గెలిచారు. 2004లో కాంగ్రెస్ నుంచి విఠల్‌రావు 2009లో బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు గెలుపొందారు. 2019లో బీఆర్ఎస్ నాయకులు మన్నె శ్రీనివాస్‌రెడ్డి విజయం సాధించారు.

1998లో గెలిచిన ఎస్ జైపాల్‌రెడ్డిని 1999 డిసెంబరు 17న ఉత్తమ పార్లమెం టేరియన్ అవార్డుతో సత్కరి ంచింది. రెండుసార్లు పార్ల మెంటుమెంబరుగా పనిచేసిన ఆయన ఈ నియోజకవర్గానికి అనేక సేవలు చేశారు. ఊరురా విద్యుత్, రైల్వే వంటి పనులు చేసి ప్రజల మన్ననలు పొందారు. ఇక తెలంగాణ ఉద్యమ సమయంలో 2009లో మాజీ సిఎం కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు ఇక్కడి నుండి పోటీ చేసి గెలిచి తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారు. మల్లిఖార్జున్‌గౌడ్, రామేశ్వరరావులు సైతం మంచి పేరు సంపాదించారు. ఇప్పుడు జరిగే సార్వత్రిక ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉన్నా.. కాంగ్రెస్ గెలిచే అవ కాశాలు ఉన్నాయని రాజకీయ పరిశీ లకులు చెబుతున్నారు.

చల్లా వంశీచంద్‌రెడ్డి ఇప్పటికే నియోజకవర్గం మొత్తం కలియ దిరిగారు.నాలుగుసార్లు సీఎం వచ్చి వంశీచంద్‌రెడ్డిని గెలిపించాలని పిలుపునిచ్చారు. శుక్రవారం నామి నేషన్‌కు వచ్చిన జనసంఖ్య చూస్తే. విజయోత్సవ ర్యాలీని తలపించింది. కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం సీపీఐ(ఎం), సీపీఐ,న్యూడెమక్రసీలు మద్దతు ప్రకటించాయి. ఇక ముస్లింలు, క్రిస్టియన్లు, ప్రజాస్వామిక వాదులు వంశీచంద్‌రెడ్డికి మద్దతు పలుకు తున్నాయి. బీఆర్ఎస్ నుంచి పోటీ పడు తున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డికి రోజు రోజుకు గ్రాఫ్ పడి పోతుంది. గత ఐదేళ్లలో ఆయన చేసిందేమి లేదని ఈసారి ఆయనకు ఓటేసే అవ కాశాలు లేవని ఓటర్లు బాహటంగానే చెబు తున్నారు. అనేక సామాజిక వర్గాలలో ఆయన పట్ల అసంతృప్తి ఉంది. బీజేపీ జాతీ య ఉపాధ్యక్షు రాలు డీకే అరుణ రాజకీయాలు ఈప్రాంత ప్రజలకు రుచి ంచడం లేదు. ముఖ్యంగా బంగ్లా రాజకీయాలను భరించలేక సొంత పార్టీ నాయకులే పార్టీని వీడి ఇతర పార్టీలో చేరి పోతున్నారు. ఇప్పటికే పదుల సంఖ్యలో బీజేపీని వీడారు. ముసు ముందు ఇంకా కొందరు పార్టీ మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వలసల జిల్లా పాలమూరులో పార్లమెంటు ఎన్నికల పోరు రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేస్తోంది. 1998లో ఇక్కడి నుంచి ఎంపీగా గెలిచిన ఎస్ జైపాల్‌రెడ్డి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు దక్కించుకున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి నుంచి ఎంపీగా పోటీ చేసి కేసీఆర్ గెలిచి దేశ రాజకీయాలపై తీవ్ర ప్రభావం చూపారు.. మొదటి నుంచి లౌకికవాదాన్ని ప్రదర్శించే పాలమూరు రాజకీయాలు రాష్ట్ర రాజకీయాలపై ముద్ర పడనున్నది. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సీడబ్ల్యూసీ మెంబరు చల్లా వంశీచంద్‌రెడ్డిని ఎలాగైనా గెలిపించి ఢీల్లీకి పంపాలని రేవంత్ గట్టిగా ప్రయత్నం చేస్తున్నారు. ఇక్కడి నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మన్నె శ్రీనివాస్‌రెడ్డి వన్నె తగ్గిపోయింది. 2019లో ఎంపిగా గెలిచిన ఆయన ఈ నియోజక వర్గానికి చేసిందేమి లేదంటూ.. నియోజకవర్గ ప్రజల్లో విమర్శలున్నాయి. బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ ఇక్కడి పోటీ చేస్తున్నారు. ముస్లింలు, వామపక్ష ప్రజాస్వామిక వాదులు బలంగా ఉన్న ఈ ప్రాంతంలో మత తత్వ పార్టీని ఎండ గట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

వంశీచంద్‌రెడ్డికి సీపీఐ(ఎం) మద్దతు



కాంగ్రెస్ పార్టీ గెలుపుకోసం సీపీఐ(ఎం) మద్దతు ఇస్తాం. గత ఐదేళ్లలో బీజేపీ, బీఆర్ఎస్ చేసిందేమి లేదు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం ప్రజల సమస్యలపై చిత్తశు ద్ధి లేకుండా పోయింది. దేశాన్ని మతంపేరుతో బీజేపీ చిచ్చుపెడుతోంది. కాబట్టి బీజేపీని ఎంపీ ఎన్నికల్లో ఓడించాలి.

ఏ,రాములు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మహబూబ్‌నగర్

ఓటమి భయం తోనే సీఎం పై విమర్శలకు దిగిన జేజమ్మ

- మహిళలపై జరుగుతున్న దాడులపై స్పందించవ్ దొరసానమ్మ ?
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత



నవ తెలంగాణ- మహబూబ్ నగర్

పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి తరపున పోటీ చేస్తున్న డీకే అరుణమ్మ ఓటమి భయంతోటి ముఖ్యమంత్రి పై వ్యక్తిగత విమర్శలకు దిగిందని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత ఆరోపించారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ నీకు నేడు బిజెపిలో వచ్చిన పదవి గౌరవం కాంగ్రెస్ పెట్టిన భిక్ష అని ఆమె గుర్తు చేశారు.దేశంలో నిత్యం మహిళపై జరుగుతున్న దాడులు, మణిపూర్లో మహిళలను నగ్నంగా ఊరేగించినప్పుడు గుర్తుకురాని ఆడపడుచులు నేడు ఎన్నికలు వచ్చే వరకే గుర్తొచ్చాయా అని ఆమె ప్రశ్నించారు. రాజకీయం అంటేనేపార్టీల విధానాలు ప్రభుత్వ పాలసీలపై విమర్శలు ప్రతి విమర్శలు ఉంటాయని అందుకు నీవు ఆడబిడ్డగా అడ్డం పెట్టుకొని తప్పించుకోలేవని ఆమె అన్నారు. జనాభాలో 51 శాతం మహిళలు ఉన్నారని ఒక ముఖ్యమంత్రి మహిళను అని చూడకుండా వ్యక్తిగతంగా విమర్శలను చేయడం తగునా అని అడుగుతున్న జేజమ్మ మీ జాతీయ పార్టీ నాయకులు, రాష్ట్ర పార్టీ నాయకులు ఎందుకు మహిళపై జరుగుతున్న అంశాలను ప్రశ్నించడం లేదని ఆమెని నిలదీశారు. తెలంగాణ యాసలు దొరసాని అంటే గౌరవం పదం అని కూడా తెలియని అజ్ఞానిగా రాజకీయాల్లో ఉన్నావా అని అన్నారు.నడిగడ్డ ప్రాంతంలో మీ కుటుంబం చేసిన అరాచకాలు కల్తీ వ్యాపారాలతో ఎంతమంది మహిళల పుస్తెలతాలు తెగిపోయాయి తెలియదా నీకు అని ఆమె విమర్శించారు. ఓటమి భయంతో జిల్లాకు ముఖ్యమంత్రి రావడం లేదని సొంత జిల్లా పై ప్రేమతో ఐదో కాదు వంద సార్లు వస్తాడని ఆమె అన్నారు. మీ ప్రభుత్వ 15 ఏళ్ల పాలనలో పెరిగిన గ్యాస్ ధరలు పెట్రోల్ డీజిల్ నిత్యవసర ధరలను చూసి ప్రజలు మీకు ఓట్లు వేయాలా అని ఆమె ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని బరాబర్ అమలు చేస్తామని తెలిపారు. మీ పార్టీ విధానాలు ప్రజలకు చేసిన అంశాలను చెప్పి ఓట్లు అడుగు కానీ వ్యక్తిగత విమర్శలకు దిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాధా అమర్ మాజీ మహిళా విభాగం అధ్యక్షురాలు బెక్కరి అనిత సోషల్ మీడియా కన్వీనర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్ట్ కేంద్రాన్ని పరిశీలన



నవతెలంగాణ - బాలానగర్

బాలానగర్ పోలీస్ చెక్‌పోస్టు వద్ద శనివారం మహబూబ్‌నగర్ డిఎస్పి నర్సింలు మహబూబ్‌నగర్ అడిషనల్ కలెక్టర్ ఎస్ మోహన్ రావు ,బాలనగర్ మండల కేంద్రంలో గల పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలీస్ చెక్ పోస్టలను మహబూబ్‌నగర్ డీఎస్పీ నర్సింలు అడిషనల్ కలెక్టర్ రెవెన్యూ ఎస్.మోహన్ రావు తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా బాలానగర్ ఎస్సై తిరుపాజిని అభినందించారు. ప్రతిరోజు వాహనాలు తనిఖీ చేసి డబ్బులు పట్టుకున్నందుకు ఎన్నికల్లోఉన్నత అధికారులు ఇచ్చిన సలహాలు సూచనలు విధిగా పాటిస్తూ ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేస్తున్నారని తెలిపారు.ఎస్సైని ఉన్నత అధికారులు అభినందించారు. ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డిని ఎలక్షన్ కోడ్ ను పకడ్బందీగా మండలంలో అమలు చేస్తున్నందుకు ఉన్నతఅధికారులు అభినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ తిరుపజి చెక్‌పోస్టు వద్ద సమస్యలను డిఎస్పి నర్సింలు దృష్టికి తీసుకెళ్లాలని జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ రెడ్డి, ఐ వెంకట్ రెడ్డి పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలి

నవతెలంగాణ - హన్వాడ

ప్రభుత్వ పథకాలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలపాలని మండల పార్టీ అధ్యక్షుడు డాక్టరు వెంకటయ్య అన్నారు. మండల కేంద్రంలో బిజెపి ముఖ్య కార్యకర్తల సమావేశం మండల పార్టీ అధ్యక్షుడు డాక్టరు వెంకటయ్య శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుండి కార్యకర్తలు అందరూ ఇంటింటికి వెళ్లి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పథకాలు వివరించాలని అన్నారు. నిన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహబూబ్‌నగర్ కార్నర్ మీటింగ్ ఒక మహిళ బిజెపి పార్టీ అభ్యర్థి డీకే అరుణమ్మని మాట్లాడడం సరికాదని అన్నారు నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు రాబోయేది గెలవబోయేది బిజెపి పార్టీ అని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడడం మంచిదని అన్నారు లేనిచో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తాయన్నారు. ఈ సమావేశానికి పార్లమెంటరీ పార్టీ నాయకులు రాజన్న అసెంబ్లీ ప్రబారి రాజేందర్ రెడ్డి అసెంబ్లీ కన్వీనర్ అంజన్న జిల్లా కార్యదర్శి కొండ బుచ్చిరెడ్డి పోతుల రాజేందర్ రెడ్డి మండల నాయకులు మహేందర్ రెడ్డి ,శీను ,లింగం, రఘురాం పాల్గొన్నారు.

ఆడకూతురు పెండ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ రాజాపూర్

రాజాపూర్ మండలంలోని మొత్కులకుంట తండా గ్రామపంచాయతీకి చెందిన సభావట్ రాందాస్ కూతురు చిట్టి వివాహానికి రూ.10 వేలు యువసేన సభ్యుల ద్వారా ఆర్థిక సహాయన్ని బీఆర్ఎస్ యువనేత శ్రీ చించోడ్ అభిమన్యు రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రవి నాయక్, మాజీ సర్పంచ్ కృష్ణా నాయక్, సభవత్ ధర్మయ్య, సభవత్ పాండు, సభావట్ వస్య,బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రజలకు అండగా ఉంటా ప్రభుత్వ భూములను కాపాడుతా

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి

నవతెలంగాణ -బాలానగర్.



ప్రజలకు అండగా ఉంటా ప్రభుత్వ భూములను కాపాడుతానని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి అన్నారు. బాలానగర్ మండల కేంద్రంలో గల పెద్ద చెరువు ఆయకట్టు కింద ఉన్న సర్వే నెంబర్ 118లో మొత్తం కాలువని మార్పిడి చేసిన భూకబ్జాదారులు శనివారం పెద్ద చెరువుపైనే ఎమ్మెల్యే మీడియా సమావేశం. ఏర్పాటు చేశారు. దీనిని అడ్డుకునేదానికి ఎవరొచ్చినా ఊరుకునే ప్రసక్తే లేదని చెప్పిన ఎమ్మెల్యే అన్నారు. ఒక అసైన్డ్ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకున్న దానిపై ప్రెస్ మీట్ పెడితే దానిని అడ్డుకోవడానికి వస్తే ఊరుకోనని చెప్పారు.నేను ప్రజల కోసం పనిచేసే ఎమ్మెల్యేని. ఈ కాలువ గూగుల్ మ్యాప్ మార్పిడి అయింది. ఇది నిజమా కాదా లని తెలిపారు. అధికారులు తప్పుడు రిపోర్ట్ ఇచ్చిన దానిపై ప్రెస్ మీట్.ఎవరైనా దీనిని అడ్డుకోవడానికి వస్తే మీకు దానిలో వాటా ఎంతనో అని చెప్పాలని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ అన్నారు. జడ్చర్ల నియోజకవర్గ మీడియా మిత్రులందరూ రాగలరని కోరిన ఎమ్మెల్యే... అన్యాయాన్ని అడ్డుకోకుంటే ఇష్టరాజంగా కాలువలు, చెరువులు అన్ని మాయమైపోతాయని అన్నారు. దీనిపైన నేను ప్రజలను ఒక్కటే అడుగుతున్నాను. ఈ అసైన్ భూమిని ఈ విధంగా కాలువను మట్టేసి మార్పిడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలా వద్దా? నా పని నేను చేస్తున్నాను. మీకు ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నా పైన కంప్లైంట్ ఇచ్చుకోవచ్చు అని అన్నారు.ఈరోజు ఈ చెరువుపై ప్రెస్ మీట్ ఎందుకు పెడుతున్నానంటే దీనిపైన అధికారులు తప్పుడు సమాచారం ఇచ్చినారు.దీనిపై పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు ఇందులో నిజమెంత అని చూపించాల్సిన బాధ్యత నాపై ఉందని అన్నారు. అందుకే నేడు పెద్ద చెరువు పైనే ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నాను.కానీ భూమి పేరు మీద లేని వాళ్ళు అక్కడికి వచ్చి ఇష్టరాజ్యంగా చేస్తే నేను ఊరుకునేది లేదని అన్నారు.ప్రెస్ మీట్ దగ్గర గొడవ చేయాలనుకుంటే మేము కూడా గొడవ చేసేదానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.మేము ప్రెస్ మీట్ ద్వారా అన్యాయం, అక్రమం జరిగిన దాని గురించి ఆధారాలతో మాట్లాడాలనుకుంటున్నమని అన్నారు. దీనిపై మీకేమన్నా అభ్యంతరం ఉంటే మీరు కూడా ప్రెస్ మీ ద్వారా మాట్లాడండి అని అన్నారు. ఇదేమి బీఆర్ఎస్ ప్రభుత్వం కాదు ఇష్టం వచ్చినట్టు గూండాయిజం చేయడానికి అని అన్నారు.నేను శాంతియుతంగా పెద్ద చెరువు పై ప్రెస్ మీట్ నిర్వహిస్తున్నాను.బిఆర్ఎస్ కార్యకర్తలారా! నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ భూములన్నీ పేద ప్రజలకు చెందేటట్టు నేను కొట్లాడుతున్నాను. దీనికి రాజకీయం సంబంధం లేదు. ఈ భూమి యజమాని ఎవరు? మీరు ఒకసారి ఆలోచించండి అని అన్నారు. ఇలాంటి ప్రభుత్వ భూములు ఉంటేనే కదా మీకు ఇల్ల నిర్మాణం కోసం కేటాయించేదని అన్నారు. ఇలాగే ఉన్న భూములన్ని కబ్జాలకు పాల్పడుతుంటే కాపాడేది ఎవరు అని ప్రశ్నించారు? ఇలా కబ్జాలకు పాల్పడుతున్న నాయకుల కోసమేన మీరు పని చేయాలనుకుంటున్నది అని అన్నారు.నేడు జిల్లా మీడియా మొత్తం వస్తుంది. మీరు గొడవ చేయాలనుకుంటే అప్పుడు మీడియానే సమాధానం చెప్తాది ఎవరు తప్పు, ఎవరు ఒప్పని అని అన్నారు.బాలానగర్ ప్రజలకి మనం చెప్పాల్సిన అవసరం ఉంది. పెద్ద చెరువు కట్ట పైన ప్రెస్ మీట్. నేను శాంతియుతంగా ప్రెస్ మీట్ పెడుతున్నాను. దానిని అడ్డుకోవడానికి వస్తే నా నిజ స్వరూపం చూస్తారని ఎమ్మెల్యే తెలిపారు.దీనిని అందరూ గమనించగలరని ఎమ్మెల్యే కోరారు.ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ నాయక్ వెంకటేశ్వర రెడ్డి వెంకట్ నాయక్ తోపాటు గ్రామ పెద్దలు రైతులు వివిధ గ్రామాలకు చెందిన కార్యకర్తల అభిమానులు హాజరయ్యారు.

వయోధికులు పోలింగ్ విధానాలను ప్రచారం చేయాలి

- స్వీప్ నోడల్ అధికారి డా.శ్రీధర్ సుమన్

నవ తెలంగాణ- మహబూబ్ నగర్

వయోధికులకు పోలింగ్లో కల్పిస్తున్న ప్రత్యేక సౌకర్యాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని స్విప్ట్ నోడల్ అధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ అన్నారు. శనివారం మహ బూబ్‌నగర్ పట్టణంలో సీనియర్ సిటిజన్స్ ఫోరం భవనంలో స్వీప్ ఓటింగ్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు సీనియర్ సిటిజన్స్ (వయోధికులకు) ప్రత్యేక ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వారు వెల్లడించారు. ప్రత్యేక నోడల్ అధికారిణి జరీనా బేగం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వయోధికులకు ఓటింగ్ లో కల్పిస్తున్న ప్రత్యేక సదుపాయాల గూర్చి వివరించారు. ఈ సందర్భంగా స్వీప్ నోడల్ అధికారి మాట్లాడుతూ ఓటరు చైతన్యం కొరకు రాష్ట్ర ఎన్నికల సంఘం పలు కార్యక్రమాలు చేపడుతోందని,వయోధికులు పోలింగ్ విధానాలను ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. 85 సం. దాటిన వయోధికులకు వారి ఇంటివద్దే ఓటు వేసుకునేలా "హెూం ఓటింగ్" సౌకర్యం కలదని, అందుకు గాను ఫారం-12డి లో దరఖాస్తు చెసుకోవచ్చని, "సక్షమ్ ఆప్" ద్వారా తమ వివరాలు నమోదు చేసుకోవాలని అన్నారు. ప్రతీ పోలింగ్ కేంద్రంలో వీల్ ఛైర్, ర్యాంప్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేస్తారని అన్నారు. 18 సం. దాటిన ప్రతీ ఓటరు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవడానికి కృషి చేయాలని అన్నారు. వికలాంగులు, సీనియర్ సిటిజన్ల కొరకు కల్పిస్తున్న సౌకర్యాల గురించి స్వీప్ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం నిర్వహిస్తామని అన్నారు. "ఎన్నికల పర్వం, దేశానికి గర్వం" అనే నినాదంతో ఓటర్లందరూ ఓటింగ్ లో పాల్గొనేలా తమ బంధువులు, సమీప ఓటర్లను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనీల్, నోడల్ అధికారి సిబ్బంది వెంకటేశం, మాసూం బాబా, సాధిక్ మరియు 40 మందికి పైగా సీనియర్ సిటిజన్ ఓటర్లు పాల్గొన్నారు.



గిరిజనులను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

- ఒక్క మంత్రి పదవి ఇవ్వకపోవడం సరికాదు
- సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు శ్రీనివాస్ నాయక్

నవతెలంగాణ- మహబూబ్ నగర్

గిరిజనులను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు శ్రీనివాసనాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో శనివారం బంజారాల ఆత్మీయ సమ్మే ళనం నిర్వహి ంచారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సేవాలాల్ సేన జాతీయ అధ్యక్షులు సబావత్ శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు కావస్తున్నా గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందినట్లు సీఎం భావిస్తున్నట్లుగా ఉందన్నారు. గోండు, కోయలను ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది లంబాడీలు ఉన్నారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గిరిజన సంఘాలు, సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు సంజీవ్ నాయక్ ఆదేశాల మేరకు మహబూబ్నగర్ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నట్లు తెలిపారు. ఇక్కడి నుంచే మా సత్తా చాటుతామని అన్నారు. తండాల్లో కమిటీలు ఏర్పాటు చేసుకొని ముందుకు సాగుతామని అన్నారు. గిరిజన సంఘాల ప్రతినిధిగా తండాల్లోకి వెళ్లి ఓట్లు అడుగుతామని అన్నారు. సేవాలాల్ సేన రైతు సంఘం అధ్యక్షులు కిషన్ నాయక్ మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులను పట్టించు కోలేదన్నారు. గిరిజనులకు అందుబాటులో ఉండే శ్రీనివాస్ నాయక్ ఎంపీగా పోటీ చేస్తున్నారని. అందరం మద్దతుగా నిలుద్దామని కోరారు. సమావేశంలో రాష్ట్ర నాయకురాలు విజయ, నాయకులు రఘునాయక్, రాజేష్ నాయక్, రామదాసు నాయక్, మోహన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌కు సన్మానం



నవతెలంగాణ-వనపర్తి

అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ సతీష్ యాదవ్ ఇంటికి పార్లమెంటు బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ శనివారం చేరుకొని అల్పాహారం తీసుకున్నారు. ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏర్పడిన పరిచయం ఉన్న నేపథ్యంలో ఐక్యవేదిక అధ్యక్షుడు సతీష్ యాదవ్‌తో ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు పెట్టుకుని ఎన్నికల ప్రచారంలో భాగంగా తమ ఇంటికి రావడాన్ని స్వాగతిస్తూ కాలనీ పెద్దలతో కలసి ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్‌ను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పుడున్న అభ్యర్థులలో అడ్మినిస్ట్రేషన్ తెలిసి, ప్రజల సమస్యలపై పోరాటం చేసిన వారు తనకన్నా ఎవరూ లేరని, కనుక తనకు మద్దతునివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల పక్ష ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్‌తో పాటు కాలనీవాసులు మారం శ్రీకృష్ణ, శివకుమార్, రాములు, కురుమయ్య, శివ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సహాయ రిటర్నింగ్ అధికారికి ఈవీఎంల అప్పగింత



నవతెలంగాణ-వనపర్తి

పార్లమెంటు ఎన్నికల నిర్వహణకు మొదటి ర్యాండమైజేషన్ అనంతరం ఈవీఎంలను వనపర్తి సహాయ రిటర్నింగ్ అధికారి యం.నగేష్‌కు అప్పగిస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం ఆర్డీవో కార్యాలయ ఆవరణలోని ఈవీఎం గోదాం నుండి ప్రజా ప్రతినిధుల సమక్షంలో క్లోజ్డ్ కంటైనర్‌లో పోలీస్ భద్రతతో చిట్యాల వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌కు తరలించారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు బ్యాలెట్ యూనిట్స్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్‌లను పోలీసు బందోబస్తు నడుమ చిట్యాలలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోడౌన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. జిల్లా సహాయ రిటర్నింగ్ అధికారి యం.నగేష్, తహసిల్దార్ యాదగిరి, రమేష్ రెడ్డి, భాజపా ప్రతినిధులు దాసరాజు, ప్రవీణ్, కుమారస్వామి, సీపీఎం ప్రతినిధి పరమేశ్వరాచారి, కాంగ్రెస్ ప్రతినిధి వేణాచారి, బీఎస్పీ నుంచి భరత్, తెదేపా ప్రతినిధి శేఖర్, ఎంఐఎం ప్రతినిధి రహీమ్‌ల సమక్షంలో తరలించారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తా..

- ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించండి
- వనపర్తి ఎమ్మెల్యే తూడి మెఘా రెడ్డి
- గోపాల్‌పేట, రేవల్లి మండలాల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-వనపర్తి

'మీ మండలాల్లో ఏ సమస్య ఉన్నా త్వరలోనే పరిష్కరిస్తాను. కావున రేపు జరగబోయే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించండని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని గోపాల్‌పేట్, రేవెల్లి మండలాల కాంగ్రెస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సమ్మేళనానికి వనపర్తి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొనేందుకు చెన్నారం గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ త్వరలోనే జరగనున్న ఎంపీ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. మొన్న జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తనను సొంతవాడిలా భావించి భారీ మెజార్టీతో గెలిపించారన్నారు. అందుకు ఎప్పటికీ మీకు రుణపడి ఉంటానని, ఈ మండలాల్లో ఏ సమస్య ఉన్నా త్వరలోనే పరిష్కరిస్తానన్నారు. కావున రేపు జరగబోయే నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ మాయ మాటలు నమ్మొద్దని, బీఆర్ఎస్ కేసీఆర్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో పెట్టిన హామీలను నెరవేర్చలేదన్నారు. పదేళ్లు అధికారం ఉన్నా ఏమి చేయలేదన్నారు. దళితున్ని ముఖ్యమంత్రి చేస్తా నని చేయలేదన్నారు. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని ఇవ్వలేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తానని చెప్పి ఇవ్వలేదన్నారు. డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తానని అందరికీ ఇవ్వలేదన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి అర్హులైన వారికి తెల్లరేషన్ కార్డు కూడా ఇవ్వలేని బీఆర్ఎస్ నాయకులు ఎంపీ ఎన్నికల్లో ఓట్ల కోసం ఏ ముఖం పెట్టుకొని మళ్లీ వస్తున్నారని ప్రశ్నించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవిని గెలిపించుకుందామని కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి గెలుపు ఖాయం



నవతెలంగాణ - పెబ్బేరు

కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవి గెలుపు ఖాయమని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు అక్కి శ్రీనివాస్ గౌడ్ అభిప్రాయం వ్యక్తం చేశారు. శనివారం నాగర్‌కర్నూల్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవిని బలపరుస్తూ నిర్వహించ తలపెట్టిన ప్రచార రథాలను పెబ్బేరు మండలం కేంద్రం సుభాష్ చౌరస్తాలో పూజలు నిర్వహించి శ్రీనివాస్ గౌడ్‌తో పాటు వనపర్తి అసెంబ్లీ ఇన్చార్జి హంసవర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మల్లు రవి భారీ మెజారిటీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేసారు. మల్లు రవి గెలుపు కోసం కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీసెల్ మాజీ అధ్యక్షులు గంధం రాజశేఖర్, మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, జిల్లా యువజన నాయకులు రంజిత్ కుమార్, కౌన్సిలర్ అశ్విని సత్యనారాయణ, శ్రీరంగాపూర్ మండల నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి, జగదీష్ రెడ్డి, దూపం సర్వేష్, ఎల్లారెడ్డి యూత్ అధ్యక్షులు సాయి గౌడ్, మాజీ డైరెక్టర్ రాములు, సోషల్ మీడియా ఆశన్న, వెంకటన్న, రాజు, నరసింహ గౌడ్, మోతె రాములు, రాజా గౌడ్, సుధాకర్ గౌడ్, కురుమన్న, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తడిసిన రైతులను ఆదుకోవాలి

- రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వరాచారి



నవతెలంగాణ-వనపర్తి

శుక్రవారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం తడిసి ముద్దయిందని, తడిచిన ధాన్యం రైతులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర చారి డిమాండ్ చేశారు. రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు వనపర్తి వ్యవసాయ మార్కెట్‌ను శనివారం సందర్శించారు. దాన్ని పరిచిన రైతులతో మాట్లాడారు. అనంతరం పరమేశ్వరచారి మాట్లాడుతూ నిన్న సాయంత్రం కురిసిన అకాల వర్షానికి వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో చాలా మంది రైతుల వడ్లు తడిచాయని తెలిపారు. కోట్ల రూపాయలు వెచ్చించి వనపర్తి వ్యవసాయ మార్కెట్‌ను నిర్మించారు. కానీ ఏ మాత్రం వర్షం వచ్చినా నీళ్లు వెళ్లడానికి సరైన కాలువలు లేక సీసీ బెడ్ లేవల్లేక రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చే వడ్లు చిన్నపాటి వర్షానికే తడిసిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 5 నెలలు కష్టపడి పండించిన పంటలు నీటిపాలయ్యే పరిస్థితి వనపర్తి వ్యవసాయ మార్కెట్‌లో ఉన్నదని, అధికారులు, రాజకీయ నాయకులు రైతులకు జరిగే నష్టాన్ని ఎవరు పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టర్లు చేసిన పని కనీసం నీరు ఎక్కడ వెళ్తుందనే ఆలోచన చేయలేదన్నారు. మార్కెట్ మధ్యలో చిన్న చిన్న కాలువలు ఏర్పాటు చేయాలని అవగాహన లేని కాంట్రాక్టర్ల నిర్లక్ష్యానికి రైతులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నపాటి వర్షానికి ఈ విధంగా ఉంటే అధిక వర్షాలు వస్తే ఏ విధంగా ఉంటాయో అధికారులు ఒకసారి ఆలోచించాలన్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు, అధికారులు వ్యవసాయ మార్కెట్ పై దృష్టి పెట్టి రైతులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. అదేవిధంగా వ్యవసాయ మార్కెట్ వారు రైతులకు సరైన కవర్లు ఇవ్వాలని, కవర్లు ఇవ్వాలంటే రైతులు ఆధార్ కార్డు జిరాక్స్ ఇవ్వాలనేది రైతులకు అవగాహన కల్పించి రైతులకు కవర్లు ఇవ్వాలని సూచించారు. మార్కెట్‌లో నిర్మాణంలో జరిగిన లోపాలకు బాధ్యులైన వారిపైన చర్యలు తీసుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి వచ్చే ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేసి లారీల నిర్లక్ష్యం లేకుండా మిల్లులకు పంపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు చిట్యాల చిన్న రాయుడు, తాటిపర్తి తిరుపతయ్య, రమేష్, లక్ష్మి, ఎర్రన్న, రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

చేరికలతో కాంగ్రెస్ పార్టీకే నష్టం

- అసలైన కాంగ్రెస్ కార్యకర్తలకు అన్యాయం
- విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు



నవతెలంగాణ-పెబ్బేరు

ఇతర పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నడం వల్ల కాంగ్రెస్ పార్టీకే నష్టం జరిగే అవకాశం ఉందని, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మండల కాంగ్రెస్ నాయకులు కొంతం దయాకర్ రెడ్డి అన్నారు. శనివారం పెబ్బేరు ప్రెస్‌క్లబ్‌లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గంధం రాజశేఖర్, రంజిత్ కుమార్ సర్వేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు జరుగుతున్నాయని, వాటిని సమర్థిస్తూ కొంతమంది నాయకులు కండువాలు కప్పుతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి నాలుగు నెలల కాలం కాలేదు. అప్పుడే పెబ్బేరు మండలం నుండి కొంతమంది గోతి కాడి నక్కల్లా... చాలామంది కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోవాలని చూస్తున్నారన్నారు. వారికి కండువాలు కప్పడం వల్ల కాంగ్రెస్ పార్టీకి నష్టమే గాని ఎటువంటి ఉపయోగం లేదన్నారు. ఎందుకంటే, గత పదేళ్ల నుంచి ప్రతిపక్షంలో ఉండి వారి నుండి ఎన్నో కేసులు కష్టాలు అవమానాలు భరించడం జరిగిందన్నారు. అలాంటి వారికి మళ్లీ ఇప్పుడు నియోజకవర్గంలోని కొంతమంది ముఖ్య నాయకులు అదే బీఆర్ఎస్ వాళ్లను కండువాలు కప్పి కాంగ్రెస్ పార్టీలోకి స్వాగతించడం పట్ల వారి ఆంతర్యం ఏంటో అర్థం కావడం లేదన్నారు. ప్రతి చిన్న విషయానికి కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిప్పిన ఈ బీఆర్ఎస్ దొంగలను మళ్లీ కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటే వారి నుండి కనీసం మనకు ఎటువంటి ఉపయోగం కూడా ఉండదన్నారు. అలాంటి వారిని చేర్చుకున్న వారు ఎంతటి వారైనా సహించేదిలేదని వారు హెచ్చరించారు. శ్రీరంగాపూర్ మండలంలో బీఆర్ఎస్ వారు కాంగ్రెస్ కార్యకర్తలను ఎన్నో కేసులను భరిస్తూ ఎన్నో అవమానాలను చేయిస్తూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో కొద్దిమందిమి మాత్రమే కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకుని కాంగ్రెస్ పార్టీ కోసం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం కోసం పని చేశామన్నారు. వారు లేకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రాలేదా 64మంది ఎమ్మెల్యేలను గెలిపించుకోలేదా. ఆ 64మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్నట్టే ఇప్పుడు కూడ 14మంది ఎంపీలను గెలిపించుకోలేమా, కొందరికి వారి వల్ల ఏమి స్వార్థం ఉందో తెలియదు. కానీ వారికి కండువాలు కప్పడం మాత్రం కాంగ్రెస్ పార్టీకి పని చేసిన కార్యకర్తలకు చాలా నిరుత్సాహాన్ని కలిగిస్తుందన్నారు. వనపర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్‌లోకి చేర్చుకునే వారికి ఒకటే విషయం చెబుతున్నాం. నియోజకవర్గంలో ఉన్న ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి కానీ, నియోజకవర్గ ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కానీ ఎవరికైనా కండువాలు కప్పాలనే ఆలోచన వస్తే ఇద్దరూ కలిసి ఒక చోట కూర్చొని మాట్లాడుకుని పార్టీ కష్టకాలంలో పనిచేసిన కార్యకర్తల సలహాలు తీసుకొని కాంగ్రెస్ కండువా కప్పాల్సిందిగా కోరుతున్నామన్నారు. లేనిచో పదేళ్ల ప్రతిపక్షంలో ఉండి, ఎన్నో కేసుల పాలైన మేము ఎంతవరకైనా వెళ్తామన్నారు. కేసులు మాకు కొత్తేంకాదు ఆ కేసులలో భాగంగా జైలుకు వెళ్లడానికైనా సిద్ధంగా ఉన్నామన్నారు. సమావేశంలో శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ నాయకులు బీరం రాజశేఖర్ రెడ్డి, శ్రీరంగాపూర్ మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆశన్న, పెబ్బేరు మండల ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, మాలపల్లె మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్, పెబ్బేరు పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయి గౌడ్, ఎద్దుల సతీష్, రంగస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవకులకు సన్మానం



నవతెలంగాణ - ఆత్మకూరు

ఆత్మకూరు పట్టణంలో అగ్నిమాపక కేంద్రం నందు శనివారం గత వారం రోజులుగా నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఇటి సమావేశానికి కేంద్ర అధికారి జై శ్రీనివాస రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏప్రిల్ నెలలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా గతం వారం రోజులుగా ఈ నెల 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాల నిర్వహించామని, ఇట్టి వారోత్సవాలలో ప్రజలు ఎక్కువగా ఉండే ప్రదేశాలు అనగా బస్టాండు, రైల్వేస్టేషన్‌లో బహుళ అంతస్తులు, పెట్రోల్ బంకులు, మొదలగు ప్రదేశాలలో ఎప్పుడైనా అగ్నికి ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర నిర్వహణలో విధులు నిర్వహిస్తున్న సందీప్ కుమార్ రెడ్డి, భానుచందర్ రెడ్డి, బెస్ట్ మెన్ అవార్డులు పొందారు. వారికి బెస్ట్ అవార్డు ప్రధానంతో పాటు సన్మానించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది సంజీవరెడ్డి, రాములు, వెంకట నరసింహయ్య పట్టణ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో 'గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ - వనపర్తి

వనపర్తి జిల్లా కేంద్రంలోని బసవన్నగడ్డ అంగన్వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అధికారి లక్ష్మీబాయి, సీడీపీఓ కృష్ణచైతన్య, సూపర్వైజర్ జ్యోతి పాల్గొన్నారు. పిల్లల తల్లులు, గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు ప్రభుత్వ ఉపాధ్యాయురాలు అనురాధా బాయి పాల్గొన్నారు. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ శ్రీదేవి, విద్యులత, లావణ్య ఏడబ్ల్యూహెచ్ పాల్గొన్నారు.

నూతన వధువరులను ఆశీర్వదించిన

చిన్నంబావి : మండల పరిధిలోని కొప్పునూరులో ఇరానీ చాయ్ రంజిత్ ఆహ్వానం మేరకు రంజిత్ కుమార్-జ్యోష్ణల వివాహ రిసెప్షన్ వేడుకకు యువ నాయకు డు కొత్త కళ్యాణ్ రావు హాజరై నూతన వధూవరులు ఆశీర్వదించారు. కార్యక్ర మంలో చిన్నంబావి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రతాప్ రెడ్డి, అగ్గన్న, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్, భోగం రమేష్, యూత్ లీడర్ ప్రకాష్ యాదవ్, జగదీష్ నాయుడు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీలు నగదు పట్టివేత

ఆత్మకూరు : పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా ఆత్మకూరులోని కొత్తకోట వై జంక్షన్ దగ్గర ఆత్మకూరు సీఐ శివకుమార్, ఆత్మకూరు ఎస్సై నరేందర్ వారి సిబ్బందితో కలిసి శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా కొత్తకోట వైపు నుంచి ఆత్మకూరు వైపు వస్తున్న ఒక బొలెరో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో ఇద్దరు వ్యక్తులు రాములు మల్దొడ్డి గ్రామం, ధరూర్ మండలం, గద్వాల జిల్లా నుంచి 51వేలు, రంగన్న మల్దొడ్డి గ్రామం, ధరూర్ మండలం, గద్వాల జిల్లా నుంచి రూ.60వేలు తగిన ఆధారాలు చూపించనందున నగదును స్వాధీన పరచుకున్నామని, మొత్తం నగదు రూ.1లక్ష 11వేలు సీజ్ వేసినట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని ఓడించాలి : సీపీఐ(ఎంఎల్)



నవతెలంగాణ-ఆత్మకూరు

బీజేపీ కార్పొరేట్ మతోన్మాద విధానాలను ఓడించాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ (ప్రజాపంథా) పార్టీ ఉమ్మడి జిల్లా సదస్సు అమరచింత మార్క్స్ భవన్‌లో శనివారం నిర్వహించారు. ఈ సదస్సుకు డివిజన్ కార్యదర్శి ప్రసాద్ అధ్యక్షత వహించగా ముఖ్య వక్తలుగా సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు యం.కృష్ణా, రాష్ట్ర నాయకులు సిహెచ్.రాంచందర్ పాల్గొని మాట్లాడుతూ దేశ స్వతంత్ర పోరాటంలో ఒక్కరోజు కూడా పాల్గొనని బీజేపీ పార్టీ ఈ రోజు దేశ భక్తులుగా ప్రచారం చేసుకుంటూ దేశంలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను అన్ని ప్రయివేటు పరం చేస్తున్నారు. మోదీని నమ్మినవారు ఎంత అవినీతి చేసినా పట్టించుకోకుండా వాళ్ల పార్టీలో చేర్చుకుంటు ప్రతిపక్షలను మాత్రం అవినీతి పేరుతో ఈ ఎన్నికల సమయంలో జైళ్లకు పంపిస్తున్నారు. ఇలాంటి వాళ్ళు మళ్ళీ అధికారంలోకి వస్తే సామాన్య ప్రజల హక్కులను కుడా హరించి బడా కార్పొరేట్ పెట్టుబడి దారులకు మరింత లాభం చేయడానికి ఎంతటి దారుణానికైనా దిగజరుతారన్నారు. మళ్ళీ అధికారంలోకి వస్తే రాజంగన్నే మారుస్తామని బహిరంగంగా ప్రకటిస్తున్నారంటే వాళ్ళు ఎవరి ప్రయోజనాల కోసం ఉన్నారో అర్థం చేసుకోవాలన్నారు. ఈ ఎన్నికల్లో వాళ్ళు చేసిన అభివృద్ధి చెప్పడానికి ఏమి లేక రాముడు రామాలయం మతం పేరుతో ఓట్లు అడుగుతూ సామాన్య ప్రజల మధ్య మత సిచ్చులు పెట్టి వాలు అధికారంలోకి రావాలనుకోవడం సిగ్గు చేటన్నారు. దేశంలో కార్మికులు, ప్రజల కష్టాలతో ఏర్పడిన ప్రభుత్వ రంగ సంస్థలను మూసేసి వేలాది మంది కార్మికులను రోడ్డున పడేశారన్నారు. కార్మికులు కొట్లాడి సాధించుకున్న చట్టాలను సవరించి 4 కోడ్స్‌గా మార్చి కార్మికుల హక్కులను కలరాశారు. వ్యవసాయ రంగాన్ని ఆదాని, అంబానీకి అప్పజెప్పడానికి 3 నల్ల చట్టాలను తెచ్చారన్నారు. కావున గత పదేళ్లలో మోడీ సర్కారు ప్రజలకు చేసిందేమి లేదన్నారు. కావున ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా నాయకులు సి.వెంకటేష్, సంబశివుడు, డివిజన్ నాయకులు కె.రాజన్న, సి.రాజు, గణేష్, సామేల్, తదితరులు పాల్గొన్నారు.



22 నుంచి సలేశ్వరం జాతర

- సలేశ్వరం జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గ పరిధిలోని ప్రఖ్యాత నల్లమల అడవులలో, సలేశ్వరం జాతర ఏప్రిల్ 22, 23, 24 తేదీలలో ప్రారంభ మవుతుంది. జాతర ఏర్పాట్లను ఎస్పీ, ఇతర పోలీస్ అధికారులు శుక్రవారం పరిశీలించి, తగు భద్రత కోసం సూచనలు సలహాలు సిబ్బందికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీతో పాటు అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్, అమ్రాబాద్ సీఐ శంకర్, లింగాల ఎస్సై జగన్ పాల్గొన్నారు.

రాముడు, గొల్ల శ్రీనుకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ





నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భర్త రాముడు మోకాళ్ళ అపరేషన్ చేయించు కొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటు న్నారు. అలాగే సింగోటం గ్రామానికి చెందిన గొల్ల శ్రీను అనారోగ్యంతో బాధప డుతూ వైద్యం చేయించుకొని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలిసి శనివారం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి వారి ఇంటికి వెళ్లి వారిని పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారితో పాటు ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామప్రజలు, తదితరులున్నారు.

కాటం విష్ణు తేజ బీఆర్‌ఎస్‌లో చేరిక



నవతెలంగాణ-కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అధ్యక్షతన గత 16ఏళ్ల నుండి బీఎస్పీ పార్టీలో పనిచేస్తున్నా బీఎస్పీ జిల్లా కార్యదర్శి కాటం విష్ణుతేజ, యం.చిన్న దర్గాస్వామి ప్రశ్నించే గొంతుక ఐన బీఆర్ఎస్ నాగర్ కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఆయన వారికి బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అగ్నిమాపక శాఖ వారోత్సవాల ముగింపు



నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

రాష్ట్రవ్యాప్తంగా అగ్నిమాపక సేవల శాఖ వారోత్సవాల్లో భాగంగా చివరి రోజైన శనివారం నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీలోని ఉయ్యాలవాడలో నిర్వహించి నట్లు ఫైర్ ఆఫీసర్ కృష్ణమూర్తి తెలిపారు. అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో గ్రామ యూపీఎస్ విద్యార్థులకు 'అగ్ని ప్రమాదాలు-జాగ్రత్త' పై వ్యాసరచన నిర్వహించి, విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉయ్యాల వాడ అగ్నిమాపక శాఖ అధికారులు, గ్రామ ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండి.సిరాజుద్దీన్ మృతి బాధకరం

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్ జి

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్



నాగర్‌కర్నూల్ పట్టణ కేంద్రానికి చెందిన సీపీఐ సీనియర్ నాయకులు ఫ్రూట్ అసో సియేషన్ సభ్యులు, ఎండి. సిరాద్దిన్ అకాల మరణించడం చాలా బాధాకరం సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్ జీ అన్నారు. ఆయన భౌతికాయంపై సీపీఐ పార్టీ జెండా కప్పి ఘనంగా నివాళులు అర్పించారు. సిరా జుద్దీన్ నిరంతరం పార్టీ ఆశయాల కోసం పాటుపడిన వ్యక్తి అని, కుటుంబ జీవనా ధారం ఫ్రూట్స్ అమ్ముకుంటూ పార్టీ కార్య క్రమాలలో చురుగ్గా పాల్గొనేవాడని, ఆయన మృతి సీపీఐ పార్టీ టౌన్‌కు తీరని లోటన్నారు. నివాళులు అర్పించిన వారిలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) జిల్లా అధ్యక్షులు పి.కృష్ణాజి, సీపీఐ పార్టీ జిల్లా కౌన్సిల్ మెంబర్స్ మర్యాద వెంకటయ్య, టౌన్ కార్యదర్శి కపిలవాయి గోపిచారి, టౌన్ సహకార్యదర్శులు కొత్ర శేఖర్, కొత్త రామస్వామి, ఎండి.సలీం, ఎండి.జమీర్ తదితరులు పాల్గొన్నారు.

కె.వెంకటేశ్వర్లకు ఘన సన్మానం



నవతెలంగాణ - తెలకపల్లి

మండల కేంద్రంలోని సీఎల్ఆర్ విద్యా సంస్థలో బీఈడీ కళాశాల అధ్యాపకులుగా పనిచేస్తున్న కె.వెంకటేశ్వర్లకు ఎడ్యుకేషన్‌లో డాక్టరేట్ పట్టా పొందడంపై శనివారం విద్యాసంస్థ కరస్పాండెంట్ వి.రాజ మహేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్ ఏం.ప్రకాష్ రెడ్డి, ఎస్.సందీప్ కుమార్, అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహారాజ అగ్ర సేన్ హిమాలయకిగర్వల్ యూనివర్సిటీ ఉత్తరాఖండ్ నుండి ఈ గౌరవ డాక్టరేట్ అందుకున్నట్లు వారు తెలిపారు. విద్యాసంస్థ డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యాభిమానులు, మండల ప్రజలు డాక్టరేట్ పొందిన అధ్యాపకులు వెంకటేశ్వర్ల కు శుభాకాంక్షలు తెలిపారు.

జూనియర్ కళాశాలల పథకానికి దరఖాస్తులు ఆహ్వానం

- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రామ్లాల్



నవతెలంగాణ-కందనూలు

జూనియర్ కళాశాలల పథకానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ జిల్లా అధికారి రామ్‌లాల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి గానూ రెప్యుటెడ్(కార్పొరేట్) జూనియర్ కళాశాలల పథకానికి రెప్యుటెడ్ స్కీం కింద ఎస్సీ విద్యార్థులకు ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్లు కల్పించనున్నామన్నారు. కొత్తగా జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కాలేజీలను ఎంపిక చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రైవేట్ జూనియర్ కళాశాలలు డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పేరుపొందిన జూనియర్ కళాశాలలను జిల్లా ఎంపిక కమిటీ షార్ట్ లిస్ట్ తయారు చేస్తుందన్నారు. అన్ని ప్రాథమిక సౌకర్యాలతో చాలినంత మంచి వసతి, ఏఈఈ, ఎంసెట్ లాంటి ప్రవేశ పరీక్షల్లో ఏకరితిలో అధిక సక్సెస్ రెట్లు. నియమావళి పూర్తి వివరాలను epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చన్నారు. కళాశాల రిజిస్ట్రేషన్‌కు చివరి తేది 27.04.2024. పూర్తి సమాచారానికి 8309811279 సంప్రదించాలన్నారు.

ఇంటింటికీ మంచినీటి సరఫరా చేయాలి

- ఎమ్మెల్యే వంశీకృష్ణ
- అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

నవతెలంగాణ-వంగూరు

మండల కేంద్రంలో ఎంపీపీ బీమమ్మ అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ సమావేశానికి ముఖ్య అతిథులుగా స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా మంచి నీటిని ప్రతి ఇంటికి సరఫరా చేయాలన్నారు. అందుకుగాను అధికారులు, ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకొని బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. గ్రామాలలో సర్పంచులు లేక సమస్యల వలయంలో గ్రామాలు చిక్కుకుంటున్నా యనే సంగతిని గ్రహించి గ్రామ సెక్రెటరీ స్పెషల్ ఆఫీసర్లు నిర్లక్ష్యం వహించ కుండా ప్రజలకు కావాల్సిన అవసరాలను తీర్చడంలో ముందుండాలని తెలిపారు. అధికారులు తమ విధులను నిర్వహించకుండా నిర్లక్ష్యం చేసి గవర్నమెంట్‌ని



బదనాం చేస్తే మాత్రం వారిపై కఠిన చర్యలు ఉంటాయని నిర్మొక మాటంగా తేల్చి చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు దృష్టి పెట్టి నకిలీ విత్తనాలు నకిలీ మందులు సరఫరా కాకుండా చర్యలు తీసుకొని రైతులను బాగుపడే విధంగా చూడాలన్నారు. ఎండాకాలం కావడంతో ఈజీఎస్ అధికారులు కూడా ఉపాధి కూలీలు పనిచేసిన దగ్గర టెంట్లు ఓఆర్ఎస్ ప్యాకెట్లు ప్రథమ చికిత్స కిట్స్, మంచినీళ్లు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మిషన్ భగీరథ, విద్యుత్, విద్య వైద్యం మరికొన్ని శాఖల అధికారులు మాత్రం నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. వంగూరు మండల కేంద్రంలో సెంటర్ లైటింగ్ రోడ్డు విస్తరణ పనులకు గాను కొద్ది రోజులలోనే వంగూరు మండల రూపురేఖలు మారుతాయని ఆయన తెలిపారు. మిషన్ భగీరథ విద్యుత్ శాఖ అధికారులను మందలించారు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సోకాస్ నోటీసులు తప్పవని హెచ్చరించారు. ఇప్పటికి కూడా గ్రామాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కెవిఎన్.రెడ్డి, వైస్ ఎంపీపీ సంధ్య, సింగిల్ విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, జిల్లా కో-ఆప్షన్ సభ్యులు హమీద్, ఎంపీడీవో విజయభాస్కర్, డీటీ వెంకటరమణ, ఎంఈఓ శంకర్ నాయక్, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతోనే ఉపాధి అవకాశాలు

- కరస్పాండెంట్ వి.రాజమహేందర్ రెడ్డి
- చదువుతోపాటు వ్యక్తిత్వ వికాసం అవసరం

నవతెలంగాణ-తెలకపల్లి

మారుతున్న పరిస్థితులు దృష్ట్యా భవిష్యత్తులో ప్రతి రంగంలో రాణించాలం టే ప్రతి విద్యార్థికి సాంకేతిక పరిజ్ఞానం, వ్యక్తిత్వ వికాసం అవసరమని సీఎల్ఆర్ విద్యాసంస్థ కరస్పాండెంట్ వి.రాజ మహేందర్ రెడ్డి, డైరెక్టర్ జిల్లెల్ల రాజేందర్ రెడ్డిలు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌జీ.రెడ్డి జూనియర్ కళాశాల లో ఉచిత కంప్యూటర్ శిక్షణ, వ్యక్తిత్వ వికాసం తరగతులను డైరెక్టర్ జిల్లెల్ల రాజేందర్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల నుండి కళాశాల విద్యార్థుల వరకు అందరూ కంప్యూటర్ శిక్షణ పొంది తగిన మెలకువలు నేర్చుకోవాలని కోరారు. మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవోర్చుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. కాబట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడం వలన ఉపాధి అవకాశాలు వస్తాయన్నారు. సీఎల్ఆర్ విద్యాసంస్థల అధ్యక్షులు శ్యాంసుందర్ రెడ్డి నేతృత్వంలో



గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఉచితంగా ఈ శిక్షణ తరగతులను ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. అంతేకాకుండా ఈ విద్యాసంస్థలో గత 3 సంవత్సరాలుగా ఇంటర్, డిగ్రీ విద్యార్థులు విశేషమైన ప్రతిభ కనబరచడం జరిగిందని తెలిపారు. ఆయనతోపాటు కళాశాల ప్రిన్సిపల్స్ మర్యాద ప్రకాష్ రెడ్డి, సందీప్ కుమార్, అధ్యాపకులు వెంకటేశ్వర్లు, భాస్కర్ రెడ్డి, వెంకటేష్, విద్యాసంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చెట్టెక్కిన మంత్రి జూపల్లి

నవతెలంగాణ- కొల్లాపూర్ రూరల్

కొల్లాపూర్ మండల కేంద్రంలో గల వివిధ గ్రామాలలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో తమ చిన్ననాటి గత స్మృతులను గుర్తు చేసుకుంటూ అక్కడే ఉన్న మామిడి చెట్టు పైకి ఎక్కి కూర్చొని కార్యకర్తలతో ఇష్టా గోష్ఠిగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సర్వీస్ నుంచి తొలగించాలి : ఎన్‌పీఆర్‌డీ

నవతెలంగాణ-కందనూలు

నాగర్‌కర్నూలు జిల్లా బిజినేపల్లి మండలంలో మూగ వికలాంగురాలుపై లైంగిక దాడికి పాల్పడిన ప్రభుత్వ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేయడం కాకుం డా పూర్తిగా సర్వీసు నుంచి తొలగించాలని ఎన్‌పీఆర్‌డీ వికలాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు కోట్ల గౌతమ్ శనివారం ప్రభుత్వాన్ని కోరారు. సస్పెండ్ చేయడం తాత్కాలిక చర్య పలుకుబడి ఉపయోగించి మళ్లీ ఉద్యోగంలో చేరే అవకాశం ఉంటుందన్నారు. అందుకే పూర్తిగా సర్వీసు నుంచి తొలగించాలని కోరుతున్నామన్నారు. సాధారణ చట్టాలతో కాకుండా 2016 వికలాంగుల రక్షణ చట్టం కింద కేసు నమోదు చేయాలన్నారు. పవిత్రమైన ఉపాధ్యాయ వృత్తిలో ఉండి ఇలాంటి నీచమైన పనులకు పాల్పడడం హేయమన్నారు. దారుణ సంఘటనకు పాల్పడిన సాంఘిక శాస్త్ర ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై కఠిన చర్యలు తీసుకొని మళ్లీ ఇలాంటి దారుణాలు జరగకుండా చూడాలని కోరారు.

గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు అభినందనలు



నవతెలంగాణ - ఉప్పునుంతల

5వ తరగతి గురుకుల సీట్లు సాధించిన విద్యార్థులకు పలువురు అభినందనలు తెలిపారు. శుక్రవారం వెలువడిన 5వ తరగతి గురుకుల ప్రవేశ పరీక్ష 2024 ఫలితాల్లో ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా బాలుర ప్రాథమిక పాఠశాల ఉప్పునుంతల నుండి ఏడుగురు విద్యార్థులు ఆడేపు మురళి అచ్చంపేట సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, మస్కూరి అరవింద్ లింగాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, బొల్లె ప్రవీణ, నడిగడ్డ వరలక్ష్మి, ఆలూరి పల్లవి, పొట్టల సిరిలకు మన్ననూర్ బాలికల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల, మేకల అక్షర వంగూర్ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో సీట్లు సాధించా రు. ఈ సందర్భంగా ప్రార్థన సమయంలో ప్రధానోపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు బాలమణి, శ్రీనివాసులు, వెంకటేష్, పద్మావతి విద్యార్థులను అభినందించారు. బాగా చదువుకొని భవిష్యత్తులో గొప్ప స్థాయికి చేరుకొని సమా జాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఆనందంతో స్వీట్లు పంచుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, మండల విద్యాశాఖ అధికారి రామారావు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, ఎఫ్ఎల్ఎన్ నోడల్ అధికారి చంద్రశేఖర్ ఉపాధ్యాయుల కృషిని అభినందించారు.

మట్టిలో మాణిక్యాలు.. గ్రామీణ క్రీడాకారులు

- కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి



నవతెలంగాణ - ఊరుకొండ

మట్టిలో మాణిక్యాల్లాంటి గ్రామీణ క్రీడాకాలను కారులను వెలికి తీసేందు కు గ్రామీణ క్రీడలు ప్రోత్సహించేందుకు క్రీడామైదానం ఏర్పాటు చేయిస్తున్నట్లు కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సంతోష్ రెడ్డి తెలిపారు. శనివారం మండల కేంద్రంలో నూతనంగా క్రీడ మైదానాన్ని తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేస్తున్న ట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువకులు ఆలకుంట శంకర్, రాజు, శ్రీశైలం, చిరంజీవి, మధు, శివ, టోనీ, పండు, గణేష్, శేఖర్, పవన్, అశోక్, సోయెబ్, దార జంగయ్య, తదితరులు ఉన్నారు.

వృద్ధులకు రెడ్‌క్రాస్ సంచార వైద్య సేవలు



నవ తెలంగాణ-కందనూలు

ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ నాగర్‌కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం పాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోనీ లింగాసానిపల్లిలోనీ వృద్ధులకు సంచార వైద్య సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ జిల్లా సెక్రటరీ రమేష్ రెడ్డి మాట్లడుతూ గ్రామంలోని వృద్ధులకు వైద్య శిభిరం నిర్వహించామన్నారు.

ఈ క్యాంపులో 60 ఏళ్లకు పైబడిన 54మంది వృద్ధులకు వైద్య సేవలు అందించామన్నా రు. వృద్ధులందరికి మధుమేహం, బీపీ పరీక్షలు నిర్వహించామన్నారు. యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీన ర్ కుమార్ మట్లాడుతూ గ్రామంలోని 54 మంది వృద్ధులకు హైపర్ టెన్షన్, డయాబెటిక్ మందులు, మల్టీవిటమిన్, కాల్షియం టానికులు, కంటి చుక్కల మందులు అందించడంతో పాటు ఆరోగ్యపరంగా తీసుకోవలసిన పలు జాగ్రత్తలను తెలిపారు. ఈ క్యాంపులో జిల్లా యూత్ రెడ్ క్రాస్ జిల్లా కన్వీనర్ కుమార్, వైద్య సిబ్బంది పద్మ ,యాదమ్మ ,ఆశా కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

లైన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్‌గా శ్రీనివాసులు

నవతెలంగాణ- కందనూలు

లైన్స్ ఇంటర్నేషనల్ డిస్టిక్ 320 ఏ రీజియన్ చైర్మన్‌గా తిప్ప శ్రీనివాసులు ఎన్నికయ్యారు. శనివారం సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన 320ఏ డిస్టిక్ 8వ కన్వెన్షన్‌లో డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ డి.కోటేశ్వరరావు తెప్ప శ్రీనివాసులుకు 202 ఏ 2025 జూన్ 7 రీజియన్ చైర్మన్‌గా నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సదవకాశాన్ని సమాజ సేవ కార్యక్రమాలు విస్తృతం చేయడాని కి కృషి చేస్తానని తెప్ప శ్రీను అన్నారు. అలాగే రీజియన్‌లో నాకు ఇచ్చిన 12 క్లబ్బులకు సహాయ సహకారాలు లైన్స్ క్లబ్ సేవలు ప్రస్తుతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ముఖ్య అతిథులు, ఆకేం విశ్వప్రసాద్, రాజవర్ధన్‌రెడ్డి, అమరేందర్ రెడ్డి, ప్రేమ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాం

- బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పోతుల వెంకటేశులు

నవతెలంగాణ-పెంట్లవెల్లి

పెంట్లవెల్లి మండలంలో శనివారం బీఆర్ఎస్ మండల కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షులు పోతుల వెంకటేశులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిందని, కానీ ప్రస్తుతం మాత్రం ప్రజలకు ఏ గ్యారెంటీ అందుబాటులోకి రావడం లేదన్నారు. రైతులకు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పుడు మాత్రం వాయిదాలు వేస్తున్నారని ఆయన ప్రభుత్వాన్ని విమర్శించారు. నాగర్‌కర్నూల్ ప్రాంతం అభివృద్ధి చెందాలం టే రేపు జరగబోయే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీని అత్యధిక మెజార్టీతో



గెలిపించాలని అందుకు అందరం పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ చిట్టెమ్మ సురేందర్ గౌడ్, ఎంపీపీ ఉమామహేశ్వరి రాజేష్, మండల ఫాక్స్ చైర్మన్ విజయరామారావు, మండల కో-ఆప్షన్ నెంబర్ అబ్దుల్లా, సీనియర్ నాయకులు రఫీ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఊరుకొండ : మండలంలోని గుడిగానిపల్లికి చెందిన గడ్డమీది చిట్టెమ్మ (50) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక నాయకుల ద్వారా విష యం తెలుసుకు న్న మాధారం మాజీ సర్పంచ్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసి డెంట్ ద్యాప నిఖిల్ రెడ్డి (డీఎన్ఆర్) బాధిత కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల ద్వారా రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రజిత కృష్ణయ్య, నాయకులు అలివేలు, ఇద్దయ్య, కవిత, రుక్మారెడ్డి, పిల్లేల యాద య్య, కుర్వ సత్తయ్య, జంగయ్య, కిట్టు, పిల్లేల రాములు, బుసంద్రం కృష్ణయ్య, బిమని మైసయ్య, శ్రీశైలం, రమేష్, రామచంద్రయ్య, విజయ్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పని చేస్తే సాధ్యం కానిది ఏది లేదు



నవతెలంగాణ-కందనూలు

టీఎస్ఆర్టీసీ ఎండి సజ్జనార్ పిలుపుమేరకు శనివారం నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ లక్ష్మే లక్ష్యం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ డిపో ఆదాయాన్ని రోజుకు అదనంగా లక్ష రూపాయ లు తీసుకురావాలన్నారు. డ్యూటీ చేసే కండక్టర్లు, డ్రైవరు ప్రతి స్టేజి దగ్గర బస్సు ఆపి ప్రయాణికులను తీసుకోవాలని, రెండు నిమిషాలు బస్సు ఆపి సింగల్‌కు 5 లేదా 6 ప్రయాణికులను అదనంగా ఎక్కించుకోవాలన్నారు. మనమందరం కలిసి కట్టుగా పని చేస్తే సాధ్యం కానిది ఏది లేదన్నారు. ఈ చాలెంజ్ కార్యక్రమం వచ్చే ఏడాది ఉగాది పండుగ వరకు ఉంటుందన్నారు. కావున డ్యూటీ చేసే ప్రతి కండ క్టర్, డ్రైవర్ ఛాలెంజ్‌గా తీసుకొని ప్రతి సర్వీస్‌కు రోజుకు అదనంగా రూ.1500 చొప్పున డిపో ఆదాయం లక్ష రూపాయలు అదనంగా తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఎంఎఫ్ భాస్కర్, టీఐత్రిలు డి.హెచ్.చారి, ఎస్‌బి.రెడ్డి, ఏడీసీలు జే.శ్రీనివాసులు, యాదయ్య, జలీల్, ఏజే ప్రకాష్, విఎస్. నారాయణ, కే.శ్రీనివా సులు, టి.శ్రీనివాసులు, డీఎస్.నారాయణ, శ్యాంసుందర్ రెడ్డి, పుష్పమ్మ, మణె మ్మ, పెంటయ్య, అనిత, సెక్యూరిటీ హెడ్గార్డ్ రామకృష్ణ, ఉద్యోగస్తులున్నారు.

రాజ్యాంగాన్ని రక్షించు పార్టీకే మా మద్దతు

- జేఏసీ చైర్మన్ జయశంకర్

నవతెలంగాణ-నాగర్‌కర్నూల్ రూరల్

దేశంలో, రాష్ట్రంలోని కొన్ని రాజకీయ పార్టీలు రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నాయని, ఆ పార్టీలకు రాబోవు పార్లమెంటు ఎలక్షన్లో గుణపాఠం చెప్పి తీరుతామని జిల్లా పొలిటికల్ జేఏసీ చైర్మన్ వంగూరు జయశంకర్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన దళిత రాజకీయ జేఏసీ ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం మాట్లాడుతూ కేంద్రంలో మతతత్వ బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలు రాజ్యాంగాన్ని మారుస్తా మని చేసిన ప్రకటనలను తీవ్రంగా ఖండించారు. త్వరలో మా మద్దతు ఏ పార్టీకి ఉంటదో బహిరంగ సభ నిర్వహించి వెల్లడిస్తామని తెలిపారు. దాదాపు మూడు సంవత్సరాలు శ్రమించి రాసిన భారత రాజ్యాంగాన్ని, అమలు పరచడంలో పూర్తి గా విఫలమైన దద్దమ్మలు, భవిష్యత్తులో మారుస్తామని ఏ పార్టీ కుట్రలు చేసిన సహించే ప్రసక్తి లేదని ఘాటుగా హెచ్చరించారు. సమావేశంలో దళిత



పొలిటికల్ జేఏసీ గౌరవాధ్యక్షులు అవుట శ్రీనివాసులు, రాష్ట్ర కమిటీ చైర్మన్ వంగూరు జయశంకర్, నాగర్‌కర్నూల్ జిల్లా కన్వీనర్‌గా గోరటి సూర్యనారాయణ, సోషల్ మీడియా ఇన్చార్జిగా జెట్టి తిరుపతయ్య, అచ్చంపేట కన్వీనర్‌గా గంధం అంతయ్య, కొల్లాపూర్ కన్వీనర్‌గా జ్యోతి, కల్వకుర్తి కనినర్గా యాదగిరిలతో పాటు వివిధ మండలాల ఇన్చార్జులు ఏకగ్రీవంగా ఎన్నుకోబడాలని తెలిపారు.

నిత్యం పూజల కొరకు విరాళం



నవతెలంగాణ-తిమ్మాజిపేట

మండలంలోని అప్పాజీపల్లి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయానికి నిత్య పూజ నిధి కోసం పెద్దకొత్త పల్లి గ్రామానికి చెందిన కొట్యూరు భారతి వినాయక రెడ్డి ఒక లక్ష నూట ఈరవై రూపాయలు దేవస్థాన కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని దేవాలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో దేవాల య కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, నివాస్ రెడ్డి, బాలస్వామి ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



నవతెలంగాణ - గట్టు

గట్టు మండల పరిధిలోని బల్గేర గ్రామంలో శ్రీ దిగంబర స్వామి జాతర సందర్భంగా క్రికెట్ పోటీలు నిర్వహించారు ఈ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా గట్టు మండల జడ్పీటీసీ బాసు శ్యామల హనుమంతు నాయుడు పాల్గొని క్రికెట్ మ్యాచ్‌ను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ క్రికెట్ మ్యాచ్ ఏ ఆటంకం లేకుండా నిర్వచ్చించుకొని,గెలుపోవటంలో సమానంగా తీసుకోవాలన్నారు. గ్రామానికి అదే విధంగా మండలానికి మంచి పేరు తీసుకురావాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ గట్టు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు బాసు హనుమంతు నాయుడు,ఎంపీటీసీ రూపవతి కిష్టప్ప, రాయపూరం వీరేష్ , బాసు నాయుడు, ఎల్లందొడ్డి రాజు , బాసు గోపాల్, పటేల్ రాజు, రామకృష్ణ, రాజు, తిమ్మారెడ్డి నాయుడు, ఈరన్న,బుగ్గల్,వినోద్,తదితరులు పాల్గొన్నారు.

ఆటలు పాటలతో పిల్లలకు విద్యను నేర్పాలి



నవతెలంగాణ - గట్టు

గట్టు మండల పరిధిలోని ఇందువాసి గ్రామంలో 1,2,3,4,5 సెంటర్స్ కలసి డే ఈ సి సి ఈ డే నిర్వహించారు పిల్లలకు అసెస్మెంట్ కార్డ్స్ ఇచ్చి పిల్లల అభివృద్ధుల గురించి తల్లిదండ్రలకు కు పిల్లలు ఆట పాటల.ద్వారా విద్యను నేర్చుకుంటున్నారని పౌష్టికాహారం తొ పాటు అన్ని అభివృద్ధులు సాధిస్తున్నారని సూపర్వైజర్ వాసంతి అన్నారు ఈ కార్యక్రమంలో తల్లులకు భాగ్యమ్మ శ్రీలత ఈరమ్మ.కావేరమ్మ వీరమ్మ హాజరయ్యారు

గుడిసె దగ్ధం



నవతెలంగాణ - గట్టు

గట్టు మండల పరిధిలోని బోయిలగూడెం గ్రామంలో శనివారం నాడు ఉదయం ఉప్పరి చిన్న రాముడు ఇంట్లో ఇల్లు దగ్ధమైంది విషయం తెలుసుకున్న గట్టు ఎస్సై రామకృష్ణ వారి యొక్క సిబ్బంది జరిగిన సంఘటన పరిశీలించారు ఎస్సై కథనం ప్రకారం బోయిలగూడెం గ్రామానికి చెందిన ఉప్పరి చిన్న రాముడు ఇంట్లో వారి యొక్క తల్లి అన్నం చేయాలని వంటసిలిండర్ను ఆన్ చేసింది గ్యాస్ వంటలు అంటుకున్నాయి ఇంట్లోనున్న వంట సామాగ్రి విలువైన పత్రాలు ఇంట్లో ఉన్న 90 వేల రూపాయలు ఖాళీ పూర్తయినయని ఎస్సై తెలియజేశారు ఇంటి యజమాని ఉప్పర చిన్న రాముడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలియజేశారు

రూ.1.15 లక్షలు సీజ్

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

లోక్ సభ ఎన్నికల కోడ్ లో బాగంగా జిల్లా వ్యాప్తంగా పోలీస్ స్టేషన్ ల పరిధిలో, సరి హద్దు చెక్ పోస్టు లలో పోలీస్ అధికారులు చేపడుతున్న వాహన తనిఖీలలో భాగంగా ఏలాంటి రశీదు లేని రూ.1,14,900 పోలీస్ అధికారులు సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటి కి అప్పగించినట్లు జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు.కేటీ దొడ్డి పోలీస్ స్టేషన్ పరిధిలో ని నందిన్నే చెక్ పోస్టు దగ్గర తనిఖీ చేయగ ఒక వాహనం లో ఏలాంటి రశీదు లేని రూ.52,000 ఉండవల్లి పోలీస్ స్టేషన్ పరిదిలోని పుల్లూరు చెక్ పోస్ట్ దగ్గర రూ.62,900 (మొత్తం రూ1,14,900)గుర్తించి సీజ్ చేసి జిల్లా ఎన్నికల గ్రీవెన్స్ రిడ్రెసల్ కమిటీకి పోలీస్ అధికారులు అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున జోగుళాంబ గద్వాల్ జిల్లా పరిధిలో ఎవరైన 50 వేల రూపాయల కొద్దీ ఎక్కువ డబ్బులను తీసుకువెళ్లరాదని ఒక వేళ తీసుకెళ్తే తగిన రశీదులు ,పత్రాలు వాటి వివరాలు వెంట తీసుకెళ్ళాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

21 న ఛలో కల్వకుర్తి మంద కృష్ణమాదిగ

నవతెలంగాణ - గట్టు

గట్టు నాగర్ కర్నూల్ పార్లమెంట్ పరిధిలో గల 7 నియోజక వర్గాల నుండి అధిక సంఖ్యలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని గట్టు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శనివారం ఒక ప్రకటన తెలియజేశారు 21వ తేదీన అనగా ఆదివారంనాడు మధ్యాహ్నం ఒంటిగంటకు కల్వకుర్తిలో జరిగే బహిరంగ సభకు మందకృష్ణ మాదిగ హాజరేస్తున్నారు కాబట్టి గట్టు మండలంలోని ఉన్న ఎంఆర్పిఎస్ నాయకులు ప్రతి ఒక్కరు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఆయన తెలియజేశారు

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే సతీమణి



నవతెలంగాణ - గట్టు

మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వివాహ వేడుకలో పాల్గొన్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి నూతన వధూ వరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. అనంతరం మండల పరిధిలోని గ్రామంలో గృహ ప్రవేశంలో ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి పాల్గొన్నారు. ఎమ్మెల్యే సతీమణి వెంట ఉమ్మడి జిల్లా డైరెక్టర్లు సుభాన్, క్యామ వెంకటేష్, ఎంపీపీ విజయ్ కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రామకృష్ణ రెడ్డి, వెంకటన్న, నాయకులు నర్సింహులు, సేద్రిక్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాట్‌లు అందజేత



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

మొదటి ర్యాండమైజేషన్ తర్వాత ఈ.వి.యం., వి.వి. ప్యాట్ లను గద్వాల్ ,అలంపూర్ నియోజకవర్గల రిటర్నింగ్ అధికారులకు అందజేయడం జరిగిందని జిల్లా కలెక్టర్/జిల్లా ఎన్నికల అధికారి బి.ఎం సంతోష్ అన్నారు. ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు కలెక్టరేట్ లో గల ఈవీఎం గోడౌన్ లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి గోడౌన్ తాళం తీసి ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించిన ఈ.వి.యం లను రిటర్నింగ్ అధికారులకు అందజేసి స్ట్రాంగ్ రూమ్ లకు తరలించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. శనివారం ఇ వి ఎం గోడౌన్ లో ఉన్న ఈ.వి.యం లకు మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి అయినందున పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు ఉపయోగించాల్సిన ఈ.వి.యం లు, కంట్రోల్ యూనిట్లు, బ్యాలట్ యూనిట్లు ,వి.వి ప్యాట్ లను జిల్లా ఎన్నికల అధికారి ఆయా నియోజక వర్గాల రిటర్నింగ్ అధికారులకు అందజేసి స్ట్రాంగ్ రూమ్ లకు తరలించి భద్రపరచాలన్నారు. గద్వాల్ నియోజక వర్గం బ్యాలెట్ యూనిట్లు 378 , కంట్రోల్ యూనిట్లు 378 , వివిప్యాట్ లు 424 కేటాయించగా, ఆలంపూర్ నియోజక వర్గానికి బ్యాలెట్ యూనిట్లు 363 కంట్రోల్ యూనిట్లు 363, వివిప్యాట్ లు 407 లను కేటాయించడం జరిగిందని ఎన్నికల అధికారి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ లు అపూర్వ చౌహాన్, ముసిని వెంకటేశ్వర్లు ,ఆర్.డి.ఓ రామ్ చందార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ నరేష్ , తహసిల్దార్లు, ఎన్నికల సిబంది, వివిధ రాజకీయ పార్టిల ప్రతినిధులు, తదితరులు ఉన్నారు.

సహకార సంఘాల సొసైటీలు ఏర్పాటు : కలెక్టర్

నవతెలంగాణ- జోగులాంబ గద్వాల

జిల్లాలో నూతనంగా మల్టీపర్పస్ పిఏసిఎస్, ఫిషరీస్, డైరీ, సహకార సంఘాల సొసైటీలను ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ అన్నారు.శనివారం కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో డిస్టిక్ కో-ఆపరేటివ్ డెవలప్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన "సహకార్ సే సమృద్ధి" పథకం క్రింద జిల్లాలోని 255 గ్రామ పంచాయతీలలో మల్టీపర్పస్ సొసైటీలను వచ్చే ఐదు సంవత్సరాలలో ఏర్పాటు చేయాలని, సొసైటీలో ఉండే సభ్యుల ఆర్థిక అభివృద్ధి కోసం పి ఏ సి ఎస్ ఆధ్వర్యంలో ఉపాధి కల్పన క్రింద పెట్రోల్ బంకులు, ఎల్పిజి గ్యాస్ డిస్ట్రిబ్యూషన్, మీ- సేవ కేంద్రాలు, ఎరువుల దుకాణాలు, చౌకధర దుకాణాల ఏర్పాటుకు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకుల ద్వారా ఆర్థిక రుణ సాయం అందించడం అందించడం జరుగుతుందన్నారు. దీని ద్వారా సంఘం సభ్యులకు బహుళ ప్రయోజనాలు చేకూర్చడం జరుగుతుందన్నారు. ఇందుకు సంబంధిత అధికారులు అందరూ కృషి చేయాలన్నారు.ఈ సమావేశంలో డి సి ఓ ప్రసాద్ రావు, జడ్పీ సీఈఓ కాంతమ్మ, డిపిఓ వెంకట్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారి గోవింద్ నాయక్, జిల్లా మత్స్య శాఖ అధికారి షకీలా భాను, పశుసంవర్ధక శాఖ అధికారి, నాబార్డ్ ఏజీఎం షణ్ముఖం, డీసీసీబీ సీఈఓ లక్ష్మయ్య పాల్గొన్నారు.



దేశంలో ప్రజాస్వామ్య మనగడ కొనసాగాలంటే బీజేపీ ఓడాలి:సీపీఐ(ఎం)

నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

దేశంలో ప్రజాస్వామ్య మనుగడ కొనసాగాలన్న రాజ్యాంగ రక్షణ జరగాలన్న మతోన్మాద బీజేపీని ఓడించి ఇండియా కూటమిని గెలిపించాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ ప్రజలకు పిలుపునిచ్చారు .శనివారం ఉదయం స్థానిక సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయంలో జి రాజు అధ్యక్షతన జరిగిన ఎన్నికల సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతాన్ని అజెండాగా పరిపాలన విధానాన్ని కొనసాగిస్తూ యువత మహిళలు రైతులు పేదలను నిర్దాక్షిణ్యంగా శ్రమదోపిడికి గురి చేస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థలను కాలరాస్తున్న బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు.

ప్రజా సమస్యలను చర్చించే చట్ట సభలను సైతం అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు చొప్పున 20 కోట్ల ఉద్యోగాల కల్పన సృష్టిస్తామన్న నరేంద్ర మోడీ ప్రభుత్వ రంగంలో ఖాళీగా ఉన్న 30 లక్షలకేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను రోడ్డున పడవేశారన్నారు. దేశంలో 40 కోట్ల మంది నిరుద్యోగులు ఉద్యోగాలు లేక ఖాళీగా ఉన్నారన్నారని మహిళలకు ఉద్దేశపూర్వకంగా 33శాతం రిజర్వేషన్లను అమలు చేయకుండా వారిని మరింత వెనక్కి నెట్టివేసిందన్నారు. బిజెపి అధికారంలోకి వస్తే ప్రభుత్వ చట్టబద్ధ రాజ్యాంగబద్ధ సంస్థల విధ్వంసం కొనసాగి సమాఖ్య స్ఫూర్తికి విఘాతం కలిగిస్తుందన్నారు. విద్య వైద్య రంగాలను వ్యాపారం చేసి బడా పెట్టుబడిదారుల చేతుల్లో పెట్టిందన్నారు. దేశ స్వాతంత్ర కోసం పోరాడిన మహనీయుల చరిత్రను పాఠ్యపుస్తకలలో తొలగించి ఆశాస్త్రీయ భావాజాలను పెంపొందిస్తుందించి సమాజాన్ని మధ్యయుగాల కాలం నాటికి నెట్టివేసిందని విమర్శించారు.



భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం జరిగిన మహోత్తర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించి హిందూ ముస్లింల ఘర్షణగా మార్చిన మతోన్మాద బీజేపీని ఓడిస్తేనే దేశంలో లౌకిక పాలనకు బాటలు పడతాయని అన్నారు దేశం స్త్రీలు పౌష్టికాహర లోపంతో బాధపడుతున్నారని కనీస మద్దతు ధరకు చట్టభద్ధ కల్పించకుండా రైతులకు భూమిని దూరంచేసి రైతాంగ సమస్యలు పరిష్కరించకుండా పోరాడుతున్న వారిని నిర్దాక్షణంగా అణచివేస్తున్నారన్నారు. వ్యవ సాయాన్ని కార్పొరేటికరణ చేస్తు కోట్లాది మంది రైతులు కార్మికులు సృష్టించిన సంపద ను కార్పొరేట్ గద్దలకు అప్పజేబుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో మత ప్రాతిపదికన పరిపాలన కొనసాగించిన అనేక దేశాలు కాలగర్భంలో కలిసిపోయాయని లౌకిక స్ఫూర్తి అన్ని రాజ్యాలకు శ్రేయస్కరమని అన్నారు. మతోన్మాద భావజాలం అనుసరిస్తున్న బిజెపిని ఓడించి ఇండియా కూటమిని గెలిపించి దేశంలో ప్రజాస్వామ్య హక్కులను ప్రజలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎంవి రమణ, జిల్లా కార్యదర్శి ఏ వెంకటస్వామి, జిల్లా కమిటీ సభ్యులు రేపల్లె దేవదాసు ,పరంజ్యోతి, వీవీ నరసింహ, ఉప్పేర్ నరసింహ, మండలాల కార్యదర్శులు నరసింహ, గంగన్న, ఈశ్వర్ పెదరాముడు, నరసింహ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల చెంతకు పోలీస్ : జిల్లా ఎస్పీ రీతిరాజ్



నవ తెలంగాణ - జోగులాంబ గద్వాల

ఈ నెల 22వ తేది (సోమవారం) నుండి ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వారానికి రెండు గ్రామాల లో ప్రజల వద్దకు పోలీస్ అధికారులు, సిబ్బంది వెళ్లి గ్రామాలలో ఉన్న శాంతి భద్రతల కు సంబంధించిన సమస్యల గురించి తెలుసుకోవడం తో పాటు ఆపద సమయంలో ఉపయోగించాల్సిన డయల్ -100, సైబర్ నేరాల గురించి, పోక్సో కేసుల నమోదు, పర్యవసనం, ట్రాఫిక్ నియమాలు, NDPS (Narcotic drugs and psychotropic Substances Act) రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ఉపయోగించుకోవాల్సిన లోన్స్ గురించి కమ్యూనిటి అవగాహనా కార్యక్రమాలు నిర్వహించబడతాయి అని ఇట్టి కార్యక్రమాలలో ప్రజలు ఎక్కువ సంఖ్య లో పాల్గొనీ విజయవంతం చేయలని జిల్లా ఎస్పీ రితిరాజ్ తెలిపారు.అందులో భాగంగా ప్రతి పోలీస్ స్టేషన్ లో వారానికి రెండు రోజులు ఎంపిక చేసిన గ్రామాలు, పట్టణ కాలనీలలో మూడు రోజులు ముందుగానే సమచారం అందించి ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి లిడయల్ -100 వినియోగంలి ప్రజలకు అత్యవసర సమయం లో పోలీస్ సహాయం పొందాలని భావించినప్పుడు డయల్ -100 వినియోగం గురించి, ఆయా గ్రామాలలో ఇప్పటి వరకు పోలీస్ స్టేషన్ కు ఎన్ని డయల్ -100 కాల్స్ వచ్చాయి, వాటినీ ఉపయోగించడం ద్వారా పోలీస్ సహాయం ఎలా పొందుతారు వంటి అంశాల గురించి అవగాహన కల్పిస్తారు.

ట్రాఫిక్ నియమాలు

రోడ్డు ప్రమాదాలకు గురికాకుండా పాటించాల్సిన ట్రాఫిక్ నియమాలు, ముఖ్యంగా జాతీయ రహదారికి అప్రోచ్ గా ఉన్న గ్రామాలలో స్పీడ్ బ్రేకర్స్, లైటింగ్, సైన్ బోర్డ్స్ ఆవశ్యకత, ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు దగ్గరలో ఉన్న వారు అందించాల్సిన ఫస్ట్ రిస్పాన్స్ చికిత్స గురించి, గ్రామాలలో ఏర్పాటు చేసుకోవాల్సి విలేజ్ రోడ్డు సేఫ్టీ కమిటీల గురించి, విత్ ఔట్ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ నంబరు ప్లేట్, మైనర్ డ్రైవింగ్ వల్ల జరిగే పరిణామాల గురించి, అలాగే %జజ% కెమెరాల ఉపయోగం గురించి అవగాహన కల్పించబడును.

లిపోక్సో కేసులులి మైనర్ బాలికలను వేధించడం ద్వారా చట్టపరంగా తీసుకుంటున్న చర్యలు, నమోదు అయ్యే పోక్సో కేసుల నమోదు, నేరం రుజువు అయితే నిందితులకు పడే శిక్షలు, బాధితులకు భరోసా కేంద్రం అందిస్తున్న సేవల గురించి అవగాహన కల్పించడం జరుగుతుంది.

సైబర్ నేరాలు

సైబర్ నేరాలకు గురైనప్పుడు వెంటనే 1930కు సమచారం అందించడం,NCRP (National Cyber crime Reporting portal%) లో పిర్యాదు చెయ్యటం గురించి, సోషల్ మీడియా (ఫేస్ బుక్, ఇన్స్టాగ్రం) ద్వారా అడ్వటేజ్మెంట్ , ఇన్వెస్ట్మెంట్ స్కీమ్స్ ద్వారా సైబర్ నేరాలకు గురవుతున్న అంశాల గురించి సైబర్ వారియర్స్ చేత అవగాహనా కల్పించబడును.

మాదక ద్రవ్యాల వినియోగం వల్ల జరిగే నష్టాల గురించి

దేశ భవిష్యత్తు ను నిర్ణయించే యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ విలువైన భవిష్యత్తు ను నాశనం చేసుకోవడం గురించి, వాటికి అలవాటు పడిన యువత డబ్బు కోసం నేరాల వైపు ప్రయాణించడం గురించి తద్వారా జరిగే దుష్ఫలితాల గురించి సంబంధిత పోస్టర్స్ ను ఆయా ప్రదేశాలలో అంటించి అవగాహన కల్పించబడును.రైతులకు ఫైనాన్షియల్ అవేర్నెస్‌లి బ్యాంకు ఖాతాల ఉపయోగం, వ్యవసాయ సంబంధిత లోన్స్ పొందుట గురించి అవగాహన కల్పించబడును.

ఖానాపూర్ గ్రామంలో పౌర హక్కుల దినం ఏర్పాటు చేయాలి

- డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం చుట్టూ నీలి జెండాలును తొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి
- తొలగించిన జెండాలు ను వెంటనే కట్టాలి
- కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న

నవతెలంగాణ - బిజినేపల్లి

మండలం ఖానాపూర్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ముందు ఖానాపూర్ దళితులు తో ఈరోజు ఉదయం 10 గంటలకు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు అంతటికాశన్న మాట్లాడుతూలి ఏప్రిల్ 14న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి పునస్కరించుకొని నీలి పెట్టడం జెండాలు అంబేద్కర్ విగ్రహం చుట్టూ కట్టడం జరిగింది. గ్రామంలో మతతత్వవాదులు సాయికుమార్ పద్మ శివ బోన్నమోని శ్రీకాంత్ మల్లేష్ బాలకృష్ణ పద్మ గిరిబాబు మరికొంతమంది బీసీలు అంబేద్కర్ అంబేద్కర్ విగ్రహం నీలి జెండాలు ఉండరాదని కాషాయం జెండాలే ఉండాలని ఉద్దేశంతోనే కొంతమంది నీలి జెండాలను తొలగించారన్నారు. ఇలాంటి ద్విచ్చర్యకు పాల్పడుతున్నారని సరైనది కాదన్నారు. ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొని డిమాండ్ చేశారు గతంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తుంటే కొంతమంది బీసీలు దళితులైన అంబేద్కర్ విగ్రహం మా దగ్గర పెట్టకూడదని అడ్డుకోవడం జరిగిందని అన్నారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ ఉండకూడదని జయంతి మూయించకుండానే రాత్రికి రాత్రి తీసేసి హనుమాన్ జండాలు కట్టడం జరిగిందన్నారు. అంబేద్కర్ జెండాలు తొలగించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో కంప్యూటర్ యుగంలో కూడా కుల వివక్ష అంటరానితనం ఇంకా కొనసాగుతుందని దీనిపై అధికారులు పౌర హక్కుల దినోత్సవ ఏర్పాటు చేసి గ్రామంలో అవగాహన కలిగించాలని ప్రభుత్వాన్ని కోరారు కూడా ఇలాంటి దుశ్చర్యకు పాల్పడడం సరే నేను కాదన్నారు ఈ కార్యక్రమంలో దళితులు నరిగే ఉషన్న. కే రాములు సుధాకర్ రాములు బాలరాజ్ బంగారయ్య సతీష్ కుమార్ స్వామి కొమ్మురాజు రాములు పాల్గొన్నారు



దర్జాగా విద్యుత్ చౌర్యం

- గ్రామపంచాయతీ విద్యుత్ ఇండస్ట్రీస్ కు వాడకం,
- శ్రీ వెంకటేశ్వర (డికార్టి గేటర్) నిర్వాహకం,
- అధికారుల పర్యవేక్షణ శూన్యం

నవతెలంగాణ - ఉప్పునుంతల

నాగర్ కర్నూలు జిల్లా ఉప్పునుంతల మండలం దేవదారి కుంట గ్రామం పరిధిలో బీటీ రోడ్డు పొడవునా ఉన్న విద్యుత్ స్తంభాలకు లైట్లు ఏర్పాటు చేసి గ్రామస్తులకు ప్రయాణికులకు వెలుతురు ఉండేలా ఏర్పాటుచేసిన దేవదారి కుంట బస్ స్టాప్ దగ్గర సమీపంలో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీస్ (డికార్టి గేటర్) మిల్లులో విద్యుత్ అక్రమ వాడకాన్ని కొనసాగిస్తూన్నారు. దొరకుతేనే దొంగ చందంగా మండలంలోని బడా వ్యాపారులు కమర్షియల్ ఇండస్ట్రీస్ వ్యాపారులు విద్యుత్ చౌర్యనికి పాల్పడుతున్నారు. విద్యుత్ శాఖ అధికారులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ విద్యుత్ చౌర్యాన్ని అరికట్టలేకపోతున్నారు. దేవదారి కుంట గ్రామస్తులు ఈ అక్రమ విద్యుత్ కనెక్షన్ తీగలు చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. పెద్ద మిల్లులకు విద్యుత్ సరఫరాతో గ్రామాల్లో లో వోల్టేజ్ సమస్యలు వస్తున్నాయి అన్నారు. ఈ అక్రమ విద్యుత్ సరఫరా కొనసాగుతుందంటూ గ్రామస్తులు బహిర్గతంగా చర్చించుకుంటున్నారు. అచ్చంపేట-ఉప్పునుంతల మండలానికి వివిధ సంబంధిత శాఖల అధికారులు ప్రతిరోజూ ప్రయాణం చేస్తూ



ఇటు అటు వెళుతుంటారు. బీటీ రోడ్డు పక్కలనే ఉన్న ఈ అక్రమ విద్యుత్ సరఫరా పై నెలలు గడుస్తున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి, గ్రామ విద్యుత్ లైన్ మెన్, విద్యుత్ ఏఈ, మండల స్థాయి అధికారులు పట్టపగలు అక్రమ సరఫరా జరుగుతున్న చూసి చూడనట్లు తమకేమీ పట్టనట్లు ఇండస్ట్రీస్ కు



సహకరిస్తున్నారా.. లేదా పర్యవేక్షణ లోపమా అని గ్రామస్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి తక్షణమే అక్రమ విద్యుత్ సరఫరాని అరికట్టి ఇండస్ట్రీస్ యజమాని పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

నాకు తెలవదు మా దృష్టికి రాలేదు

నాకు తెలవదు మా దృష్టికి రాలేదు విద్యుత్ ని అక్రమంగా సరఫరా చేయకూడదు అక్రమానికి పాల్పడినట్లు ఆధారాలు ఉంటే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యుత్తు అక్రమ సరఫరా చేసినట్లు రుజువైతే కేసు నమోదు చేపిస్తాం -

ఉప్పునుంతల, విద్యుత్ ఏఈ, అమర్ సింగ్

రేపు సందర్శించి తనిఖీలు నిర్వహిస్తాం

రేపు సందర్శించి తనకీలు నిర్వహిస్తాం ఒకవేళ అక్రమంగా విద్యుత్ సరఫరా వాడినట్లయితే విద్యుత్ శాఖ నిబంధనల ప్రకారం జరిమానా విధిస్తాం

- అచ్చంపేట, విద్యుత్ ఏఈ, ఆంజనేయులు

వెలుతురు కోసం కనెక్షన్ తీసుకొని లైట్లు కు వాడుకున్నారు.

నెలల క్రితం ట్రాన్స్ ఫార్మర్ రాకముందు ఇండస్ట్రీస్ వాళ్లు రెండు మూడు రోజులు వెలుతురు కోసం కనెక్షన్ తీసుకొని లైట్లు కు వాడుకున్నారు.రెండు రోజుల కింద ట్రాన్స్‌ఫార్మర్ పనిచేయక పోతే చెక్ చేసుకోవడానికి డైరెక్ట్ కనెక్షన్ తీసుకొని చెక్ చేసుకున్నారు. గ్రామపంచాయతీ వీధిలైట్లకు మీటర్ కనెక్షన్ లేదు డైరెక్ట్ గా విద్యుత్ సరఫరా కొనసాగుతా ఉంది

- దేవదారికుంట, గ్రామ పంచాయతీ కార్యదర్శి, రాహుల్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
నారాయణపేట
ఆదివారం | ఏప్రిల్ 21, 2024 | www.navatelangana.com

హామీలు అమలు విస్మరించిన కాంగ్రెస్



నవతెలంగాణ - కోస్గి

బూటకపు హామీలతో అధికారం చేపట్టిన రేవంత్ రెడ్డి అధికారం లోకి రాగానే నమ్మిన రైతులను విస్మరించాడనిమాజీ ఏమెల్యే పట్నం నరేందర్ రెడ్డి అన్నారు.శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అంటేనే మోసమని, రైతులను దగా చెయ్యడం కాంగ్రెస్ కి వెన్నతో పెట్టిన విధ్య అని అన్నారు. గత సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన ఒక్క హామీ కూడా కాంగ్రెస్ నెరవేర్చలేదని ఆయన దుయ్యాపట్టారు..రైతుబందు 15,000/- ఇస్తామని గెలిచాకా ఉన్న పదివేలు కూడా ఆపారని ఆయన అన్నారు. రైతులకు ధీమాగా ఉన్న రైతు భీమాను ఇవ్వకుండా రైతులను పూర్తిగా విస్మరించడం వారికే తగునని తెలిపారు.మహిళల కు ఇస్తామన్న రూ:2500 మాట పత్తా లేకుండా పాయే అని ఆయన ఎద్దేవా చేశారు.ఈ ఎంపీ ఎన్నికలలో దగా కాంగ్రెస్ కి ఓటు తో బుద్ధి చెప్పాలని ఆయన కోరారు. ఈ ఎన్నికలలో తెలంగాణ అభివృద్ధి ఇలాగే కొనసాగాలంటే మన్నె శ్రీనివాస్ రెడ్డి గారిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలాని కోరారు.ఈ కార్యక్రమంలో మాజీ స్పోర్ట్స్ అతరిటి చెర్మన్ వెంకటేశ్వర్లు, శ్యాసం రామకృష్ణ, కౌన్సిలర్లు జనార్దన్ రెడ్డి,బందెప్ప,చాంద్ పాషా, ఉసెనప్ప,వైస్ ఎంపిపి సాయిలు, నిరంజన్ రెడ్డి, మోహన్ గౌడ్,చైతన్య గౌడ్, బుగ్గప్ప, వెంకట్ రాములు, రుద్రప్ప, క్రిష్ణ, పి రాములు ,వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

25.32 లీటర్ల లిక్కర్, 12,400 రు పట్టివేత

నవ తెలంగాణ నారాయణపేట టౌన్



పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్న జెట్రం గ్రామానికి చెందిన కంచే వెంకటేష్ నారాయణపేట నుండి అక్రమంగా మద్యం తీసుకెళుంటే టాస్కోఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి 9.72 లీటర్లు, 8500 రూపాయల లిక్కర్ పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు. మరియు నారాయణపేట పట్టణ సుభాష్ రోడ్ కాలనీకి చెందిన సురేష్ గౌడ్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం తీసుకు వెళ్తుంటే టాస్క్ ఫోర్స్ పోలీసులు15.6 లీటర్ల లిక్కర్, వాటి విలువ 3900 రూపాయలు ఉంటుందన్నారు. అట్టి లిక్కర్ ను నారాయణపేట శివారులో పట్టుకుని పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న కంచె వెంకటేష్, సురేష్ గౌడ్‌లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా మద్యం నగదు ఇతర విలువైన వస్తువులు రవాణా చేయరాదని ఒకవేళ చేస్తే వాటికి సంబంధించిన తగు పత్రాలు కలిగి ఉండాలని లేనియెడల వాటిని సీజ్ చేసి గ్రివియస్ కమిటీకి పంపించడం జరుగుతుందని తెలిపారు.

మద్యం పట్టివేత

నవతెలంగాణ - మక్తల్



పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని భూతప్పూర్ గ్రామానికి చెందిన చేన్నయ్య గౌడ్ ఇంట్లో అక్రమంగా మద్యం నిల్వ ఉంచినందున టాస్కోర్స్ పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి మద్యం పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా లిమక్తల్ ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి గారిలి విచారణ అనంతరం మొత్తం 43,75 లీటర్ల లిక్కర్ వాటి విలువ 76,160/- రూపాయలు ఉంటుందని ఈ మద్యం అక్రమంగా నిల్వ ఉంచిన పెద్ద చెన్నయ్య గౌడ్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు ఎవరు అక్రమంగా మద్యం నిల్వ ఉంచరాదన్నారు. రవాణా చేయరాదని ఎస్ఐ హెచ్చరించారు. లేనియెడల వాటిని సీజ్ చేసి కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు.

ఘనంగా చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలు



నవతెలంగాణ- నారాయణ పేట టౌన్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రివర్యులు తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 74 వ జన్మదిన సందర్భంగా నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం క్యాతన్ పల్లి వీరభద్రేశ్వర దేవాలయంలో శనివారం నారా చంద్రబాబు నాయుడు పేరుమీద పూజ చేసి అర్చన చేసినట్లు ఉమ్మడి మహ బూబ్నగర్ జిల్లా టిడిపి పార్లమెంట్ ఉపాధ్యక్షులు రాములు యాదవ్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో విజయం సాధించి ఆంధ్రప్రదేశ్ కు ముఖ్యమంత్రి కావాలని వీరభద్రేశ్వర స్వామిని కోరుకోవడం జరిగిందని, ఆంధ్రప్రదేశ్లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణపై తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడానికి చంద్రబాబు నాయుడు కృషి చేస్తారని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షుడు రాములు యాదవ్ మండల పార్టీ ఉపాధ్యక్షుడు ఈరన్న గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు.

అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ పరీక్షల ఫీజు మే 6 వరకు గడువు

నారాయణపేట టౌన్ : అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మొదటి సెమిస్టర్ పరీక్షా రుసుము మే 6వ తేదీ వరకు చెల్లించ వలెనని స్టడీ సెంటర్ సమన్వయకర్త భాస్కర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల తేదీల వివరాలు మొదటి సెమిస్టర్ 26-05-2024 నుండి 01-06-2024 పరీక్షలు నిర్వహించ బడునని తెలిపారు. మిగతా వివరాల కొరకు స్టడీ సెంటర్ నారాయణపేట నందు సంప్రదించగలరని తెలిపారు.

లక్ష ఏడువేల నగదు పట్టివేత

నారాయణపేట టౌన్ : పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున నారాయణపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జలాల్ పూర్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు ఐటిబిపి బలగాలు వాహనాల తనిఖీలు నిర్వహించగా కర్ణాటక నుండి నారాయణపేట వస్తున్న ఇద్దరు వ్యక్తులు జగలింపం, కర్నే గ్రామం గుర్మిత్కల్ 57 వేలు, కాశీం అప్ప బైరం పల్లి మాగనూరు 50 వేలు కర్ణాటక నుండి నారాయణపేట వస్తుంటే జలాల్ పూర్ చెక్ పోస్ట్ వద్ద పోలీసులు మొత్తం 1,07,000 రూ పట్టుకొని రూపాయలు సీజ్ చేసి గ్రివియస్ కమిటీకి పంపించడం జరిగిందని ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు 50 వేల రూపాయల కంటే ఎక్కువ రూపాయలు తీసుకువెళ్లరాదని, ఒకవేళ తీసుకువెళ్తే వాటికి సంబంధించిన రసీదు ఉంచుకోవాలన్నారు. లేని ఎడల వాటిని సీజ్ చేసి గ్రీవియస్ కమిటీకి పంపించడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

గ్రామాలలో ఫ్లగ్ మార్చ్

నవ తెలంగాణ నారాయణపేట టౌన్



పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ప్రజల్లో చైతన్యం నింపేందుకు, స్వేచ్ఛగా ఓటు వేయడానికి ప్రోత్సహించేందుకు ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు శనివారం పేట రూరల్ ఎస్సై కృష్ణ దేవ్ ఆధ్వర్యంలో సమస్యాత్మక గ్రామాలైన అమ్మి రెడ్డి పల్లి, బోయిన్ పల్లి గ్రామాలలో స్థానిక పోలీసులు, కేంద్ర సాయుధ పోలీసు బలగాలు కవాతు నిర్వహించినట్లు ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ దేవ్ మాట్లాడుతు ఎన్నికల సమయంలో ప్రజలను పోలింగ్ ప్రక్రియలో పాల్గొనకుండా నీరుత్సాహ పరిచే కొన్ని అసాంఘిక శక్తులను, ఎన్నికల సమయంలో తిరుగుబాటు కార్యకలాపాలు పెరగకుండా ప్రజల్లో విశ్వాసం నింపేందుకు కేంద్ర సాయుధబలగాలచే సమస్యత్మక గ్రామాలలో ఫ్లగ్ మార్చ్ నిర్వహించడం జరిగిందని ఎస్సై తెలిపారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు, స్థానిక పోలీసులు పాల్గొన్నారు.

పోలీసు వ్యవస్థపై మరింత నమ్మకం పెరగాలి

నవ తెలంగాణ -నారాయణ పేట టౌన్



నేరస్థులకు శిక్ష పడటం ద్వారా భాధితలకు పోలీసు వ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. కోర్టులో చార్జి షీట్ వేసిన ప్రతి కంటెస్టెడ్ కేసులో శిక్షల శాతం పెంచేందుకు కోర్ట్ డ్యూటీ పోలీస్ అధికారులు,పై అధికారులు సమన్వయంతో కృషి చేయాలని, నేరాలకు పాల్పడితే శిక్ష పడుతుందనే భయం కలగాలని, ఆయా కేసులలో శిక్షల శాతం పెరగడం ద్వారా పోలీస్ వ్యవస్థ పై ప్రజలకు మరింత నమ్మకం పెరుగుతుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. కేసు నమోదు అయి కోర్ట్ లలో చార్జిషీట్ అయిన కేసులలో శిక్షల శాతం పెంచేందుకు తీసుకోవాలసిన జాగ్రతలపై ఎస్పీ యోగేష్ గౌతమ్ కోర్ట్ డ్యూటీ అధికారులతో జిల్లా పోలీస్ కార్యాలయంలోనీ కాన్ఫరెన్స్ హాల్లో శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నర్వ పోలీస్ స్టేషన్ పరిధిలోని హత్య కేసులో నేరస్తునికి యావజ్జీవ శిక్ష పడటంలో బాగా పనిచేసిన పోలీస్ అధికారులను, కోర్టు డ్యూటీ అధికారులను,పీపీలను ఎస్పీ అభినందించి రివార్డ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ఈ సంధ్బంగా ఎస్పీ మాట్లాడుతు నేరాలను నియంత్రించడంతో పాటు నేరస్తులను కట్టడి చేయాలంటే పకడ్బందీ దర్యాప్తు నిర్వహించి సరైయిన సాక్ష్యాధారాలు అయినటువంటి సాక్షుల వాంగ్మూలాలు, లేదా సాంకేతిక మరియు వైద్య అధారాలను సేకరించి వాటిని సరైన పద్ధతిలో కోర్టుకు సమర్పించడం ద్వారా నేరస్థులకు కోర్టులో శిక్ష విధించడం జరుగుతుందని తద్వారా నేరస్తుల్లో నేరాలకు పాల్పడాలంటేనే భయం కలిగే పరిస్థితి రావాలని, రానున్న రోజుల్లో నేరస్థుల నేరాలను నిరూపణ శాతాన్ని పెంపోందించాలని నేరస్థులకు శిక్ష పడటం ద్వారా భాధితలకు పోలీసు వ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని ఎస్పీ అన్నారు. నేరానికి పాల్పడిన నేరస్థుడికి కనీసం ఆరునెల నుండి ఒక సంవత్సరం లోపైన శిక్షపడటం ద్వారా నేరస్థులపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. అందరు సంబంధిత నేరం గురించి మర్చిపోక ముందే నేరస్థుడికి శిక్షను విధించడం ద్వారా నేరస్థులకు నేరాలు చేయాంటే బయపడుతారని అన్నారు. అందుకు కోర్టు డ్యూటీ అధికారులు తగు జాగ్రతలు తీసుకోవాలని, కాంటెస్టెడ్ కేసులలో నిందితులు బాధితులను భయపెట్టడం, ప్రలోబాలకు, వత్తిడికి మరియు ఇబ్బందులకు గురి చేయడం వంటివి జరిగే అవకాశం ఉంటుందని అందుకు కోర్టు డ్యూటీ అధికారులు బాధితులతో మాట్లాడాలని, అలాంటి పరిస్థితి ఉంటే వెంటనే ఎస్ హెచ్ ఓ లకు గాని, పై అధికారులకు గాని తెలియజేయాలని సూచించారు. సాక్షుల వివరాలు నిందితులకు షేర్ చేయకుండ జాగ్రత్తపడాలని, ఏదైనా కేసు ట్రయల్స్ కు వచ్చినప్పుడు సాక్షులకు పార్ట్ -2 స్టేట్మెంట్ చదివి వినిపించాలని సూచించారు. ఏదైనా కేసు నమోదు అయినప్పుడు ఇన్వెస్టిగేషన్ అధికారులు పార్ట్ -2 స్టేట్మెంట్ వ్రాసే క్రమంలో మ్యాటర్ సాగదీయకుండా కావాల్సిన పాయింట్స్ వచ్చే విదంగా సాక్షుల మాండలిక భాష లోనే వ్రాసే టట్లు జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. కేసు నమోదు అయిన మరుసటి రోజే సీజర్ ప్రాపర్టీ నీ కోర్టు లో ప్రొడ్యూస్ చేసేటట్లు చూసుకోవాలని, అందుకు ప్రతి ఒక్కరు ప్రాపర్టీ రిజిష్టర్ ను మెయింటైన్ చేయాలనీ ఆదేశించారు. కోర్టు కేసు విచారణలో నిందితుల హాజరైన వివరాలు నమోదు చేయాలని కేసులలో సాక్షులను ప్రవేశపెట్టేటప్పుడు వారికి పూర్తిగా వివరించాలని, ఎప్పటికప్పుడు సీసీ నెంబర్ లను పొందేటట్లు చూసుకోవాలన్నారు. సాక్షులు, ముద్దాయి లు కోర్ట్ కు హాజరయ్యేలా చూసుకోవాలని కోర్టు డ్యూటీ అధికారులకు సూచించారు. కాంటెస్టెడ్ కేసుల ప్రతి దశను ఎప్పటికప్పుడు ఎస్సై లకు, ఇన్స్పెక్టర్ లకు తెలియజేయాలన్నారు.కోర్టు డ్యూటీ అధికారులు, లైసనింగ్ అధికారులు, ఎస్ హెచ్ ఓ లు సమిష్టిగా పని చేసి శిక్షల శాతం పెంచే దిశగా కృషి చేయాలని సూచించారు. అలాగే కోర్ట్ డ్యూటీ అధికారులు బాగా పని చేస్తే అవార్డులు రివార్డులు వస్తాయని, విధులు సక్రమంగా నిర్వర్తించకపోతే మెమోలు కూడా వస్తాయని, కావున ప్రతి ఒక్కరూ బాగా పనిచేసి జిల్లా కు, పోలీస్ శాఖ కు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో బిసిఆర్బి డీఎస్పీ మహేష్, ఐటీ కోర్ ఎస్సై సునీత, అన్ని పోలీస్ స్టేషన్ల కోర్ట్ డ్యూటీ అధికారులు పాల్గొన్నారు.

వలస కూలి కుటుంబాన్ని ఆదుకోవాలి : సీఐటీయూ

నవతెలంగాణ - నారాయణపేట టౌన్



వెట్టిచాకిరి చేయించుకుం టున్న గుంపు మేస్త్రీలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.వెంకట్రామా రెడ్డి, బలరాం డిమాండ్ చేశారు.నారాయణపేట జిల్లా ఊట్కూరు మండల పరిధిలోని పెద్ద గ్రామ వలస కూలి జిన్నారం చెన్నప్ప, నీరటి బాలప్పలు కర్ణాటకలో పని ప్రదేశాలలో పని చేస్తూనే ప్రాణాలు వదిలారని, వారి కుటుంబాలకు ఎలాంటి సహాయం అందివ్వలేదని సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి వెంక ట్రామిరెడ్డి ,బలరాం తెలిపారు. బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరుతూ శనివారం రోజు జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్రం సిద్ధించి 76 సంవత్సరాలు గడిచి పోయిన ప్పటికిని వెట్టిచాకిరి కార్మిక వ్యవస్థ ఇంకా కొనసాగడం ఆందోళనకరమన్నారు.జిన్నారం చెన్నప్ప 26-8-2023 న కర్ణాటక రాష్ట్రంలోని హాసన్ పట్టణంలో బీటి రోడ్డు పనులలో చేస్తుండగానే స్పృహ తప్పి పడిపోయి ప్రాణాలు వదిలారు, ఎలాంటి పోస్టుమార్టం లేకుండా పులిమామిడి గ్రామం కు చెందిన గుంపు మేస్త్రి వెంకటయ్య అడావుడిగా భౌతికకాయాన్ని పెద్ద జట్రం గ్రామం తరలించారు.బాధిత కుటుంబముకు 10 లక్షల రూపాయలు గుంపు మేస్త్రి ఇస్తా అని పెద్దల సమక్షంలో ఒప్పుకొని ఒప్పంద పత్రం రాయించి నేటికి ఆరు నెలలు గడుస్తున్నా పైసా కూడా అందివ్వలేదు. నీరటి బాలప్ప 13 -04- 2024న ప్రమాదవశాత్తు కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీ జిల్లాలో గదిగా పట్టణం నందు భవన నిర్మాణం పనులు చేస్తుండగా అనుమాన స్పదంగా మరణించారు ఆయన మరణ విషయాన్ని భార్యకు సకా లంలో సమాచారం అందివ్వలేదు.భౌతిక కాయని ఆసు పత్రికి తరలించిన తర్వాతనే ఆమెకి విషయం తెలిపారు. ఆతర్వాత హుటాహుటిన ఎట్లాంటి పోస్టు మార్టం లేకుండానే పెద్ద జట్రం గ్రామానికి తీసుకొచ్చారు. శర మామూలే అన్నట్టు అదే గ్రామానికీ చెందిన గుంపు మేస్త్రి ముస్కే రాము గ్రామపెద్దల పంచాయతీలో లక్షన్నర ఒప్పుకొని అంత్యక్రియలను పూర్తి చేశారు.అత్యంత అన్యాయ ంగా వలస కార్మికులను అక్రమంగా తరలించక పోతున్నారని తెలిపారు. నాణ్యత లేని ఆహారం పెడుతూ అసౌకర్యంగా పరిసరాలలో ఆవాసం ఏర్పాటు చేసి పసులో మాదిరిగానే పని చేయించు కుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.వట్టి చాకిరి చేయించు కుంటున్నారన్నారు.అడ్వాన్సు లక్షనరనో, రెండు లక్షలో ఇవ్వడం 10 నెలలాలు పనిచెయ్యాలి. బోజనం మేమే ఆవాసం మేమే అనడంతో నిరుపేదలు ఆశపడి కుటుంబం కుటుంబమే గుంపు మేస్త్రీ కింద బందిలు అయిపోతున్నారు.

వలస కూలీలు గుంపు మేస్త్రిల విష కౌగిలి నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడింది. దాంతో ప్రాణాలు సైతం వదులుతున్నారు తప్ప వారి నుండి మాత్రం తప్పించుకోవడానికి వీలు కావడం లేదు కావున జిల్లా అధికారులు స్పందించి వలస కూలీలతో వెట్టి చాకిరి చేయించుకుంటున్న గుంపు మేస్టిల పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.బాధిత కుటుంబాలకు అన్ని విధా లుగా ఆదుకోవాలని,మరణించిన కార్మికుల కుటుంబంలో చిన్న పిల్లలకు మంచి విద్యను అందించాలని అందుకు వారిని గురుకుల పాటశాలలో చెర్పించాలని కోరారు . బాధిత కుటుంబ సభ్యులతో కలసి వినతిపత్రం అందజేశారు

చిన్న చిన్న తప్పిదాల వల్లే అధికారం కోల్పోయాం

- కలిసికట్టుగా పోరాడి అధికారాన్ని తెచ్చుకుందాం...
- బిఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి.

నవ తెలంగాణ- నర్వ



మనందరం చేసిన చిన్నచిన్న తప్పిదాల వల్లే రాష్ట్రంలో అధికారాన్ని కోల్పోయామని ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో కలిసికట్టుగా పోరాటం చేసి అధిక ఎంపీ స్థానాలను గెలుచుకొని కెసిఆర్ కు కానుకగా ఇద్దామని బీఆర్ఎస్ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నే శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం నర్వ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన మండల సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గ్రామాలను పట్టణాలుగా మార్చిన ఘనత కేసీఆర్ ది అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. కేంద్రంలో 10 సంవత్సరాలు అధికారంలో ఉన్న బిజెపి పార్టీ రాష్ట్రానికి చిన్న పైసా కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర ప్రభుత్వము తెలంగాణపై ఎందుకు చిన్నచూపు చూడడం జరుగుతుందని మండిపడ్డారు. ఆంధ్రాలో ఉన్న ప్రాజెక్టులకు, కర్ణాటకలో ఉన్న ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించి ఎన్నో నిధులను కేటాయించడం జరుగుతుంది. కానీ తెలంగాణలో ఉన్న ప్రాజెక్టులు కేంద్రానికి కనిపించవా ప్రశ్నించారు. తెలంగాణను ఇంత చిన్నచూపు చూస్తున్న బిజెపి పార్టీకి ఓటు వేస్తే వ్యవసాయ మోటార్లకు మీటర్లు బిగించడం ఖాయమన్నారు. కాబట్టి ఓటర్లు ఆలోచించి మే 13న జరిగే పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ ఎస్‌పార్టీ బలపరిచిన మహబూబ్‌నగర్ పార్లమెంటు అభ్యర్థిని అయిన నాకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు రామ్మోహన్ రెడ్డి,రాజేందర్ రెడ్డి లు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం టిఆర్ఎస్ పాలనలో అందించినటువంటి సంక్షేమ పథకాలను, చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ ఇప్పుడున్న ప్రభుత్వ ము నెరవేర్చని హామీల గురించి వివరించి ఓటు వేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అధికారం కోల్పోయిన నెలలోనే పార్టీలు మారిన సన్నాసులతో లేదని రాజేందర్ రెడ్డి హితబోధ చేశారు. ప్రస్తుతం ఇప్పుడున్న కార్యకర్తలు నాయకులు పార్టీకి పట్టుకొమ్మ లాంటి వారని కలిసికట్టుగా పనిచేసి ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డిని గెలిపించు కుందామన్నారు. మహబూబ్ నగర్ పార్లమెంటు పరిధిలో ఉన్నటువంటి ఏడు మంది ఎమ్మెల్యేలు ఓడిపోవడం జరిగిందని ఈ పార్లమెంటు ఎన్నికల్లో మన ఎంపీ అభ్యర్థి అయిన మన్నే శ్రీనివాస్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకొని పార్లమెంటుకు పంపినట్లయితే మళ్లీ ఏడు నియోజక వర్గంలోని ఎమ్మెల్యేలు గెలుపొందిన దానికి సమానమవు తుందన్నారు.కాబట్టి ప్రతి కార్యకర్త ఒక సైనికులాగా పనిచేసి గెలుపు కృషి చేయాలని పిలుపునిచ్చారు.అధికారం కోల్పోయిందని భయపడాల్సిన పనిలేదని మీ వెంట ఎల్లప్పుడు మేముంటామని భరోసానిచ్చారు.ఎంపీపీ జయ రాములు,మక్తల్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు గౌడ్,నియోజక వర్గ నాయకులు రాజ వర్ధన్ రెడ్డి,రాజుల ఆశి రెడ్డి,పిఎసిఎస్ చైర్మెన్ శ్రీనివాస్ రెడ్డి,వైస్ చైర్మన్ లక్ష్మణ్,మండల పార్టీ అధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి,మండల నాయకులు జీ వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు దండు అయ్యప్ప, డాక్టర్ శంకర్,ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపసర్పంచులు,నియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

గురుకుల పాఠశాలకు విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ - మరికల్

మండల కేంద్రంలో నిరుపేద విద్యార్థులు, ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ గురుకుల ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి గురుకులాలకు ఎంపికైన విద్యార్థులు.మరికల్ మండలంలో తీలేరు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు వర్షిత, మున్నా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం అనురాధ తెలిపారు. మరికల్ మండల కేంద్రంలో హరిజనవాడలో ఉన్న ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మనోజ్ కుమార్, హరిప్రియ ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం కవిత తెలిపారు. అప్పంపల్లి పాఠశాలలో అజయ్ కుమార్, చిత్తనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పల్లవి, చైత్ర, అశోక్. మరికల్ పట్టణంలోని పీస్ ఏంజెల్స్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శిల్పా, శివశంకర్, రామకృష్ణ, యువరాజ్ నాయక్, సింధేశ్వర్ నాయక్, సాయి సంకల్ప్ గౌడ్, హర్షవర్ధన్, వినోద్ కుమార్, ప్రేమ్ కుమార్ ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్స్ కాస్పె మల్లేష్, ఆదిత్య బుక్ సెంటర్ తిరుపతి ప్రిన్సిపాల్ రఘు జీవన్ తెలిపారు.

ఊట్కూర్:మండల పరిధిలోని చిన్న పొర్ల గ్రామంలోని ఎంపీపీ ఎస్ తెలుగు మీడియం పాఠశాల కు చెందిన విద్యార్థులు శ్రావణి అక్షర గురుకుల పాఠశాల లో 5వ తరగతి ప్రవేశానికి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు జగదీష్ ఒక ప్రకటనలో తెలిపారు ఇద్దరు విద్యార్థులు గురుకుల పాఠశాలకు ఎంపిక కావటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు







వైభోగంగా పార్వతీ పరమేశ్వరుడి రథోత్సవం

నవ తెలంగాణ - క్రిష్ణా



శ్రీపార్వతి పరమేశ్వరుడి రథోత్సవం శనివారం అంగరంగ వైభవ పేతంగా జరిగింది. మండల పరిధిలోని చేగుంట గ్రామంలో పార్వతీ పర మేశ్వరుడి జాతర ఉత్సవాలో భాగంగా శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.

పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి..

- ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్

నవతెలంగాణ - ఊరుకొండ

భారతీయ జనతా పార్టీ గెలుపు లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఓబీసీ జిల్లా అధ్యక్షుడు వాగుల్దాస్ నిరంజన్ గౌడ్ పిలుపునిచ్చారు. శనివారం ఇంటింటి ప్రచారంలో భాగంగా ఉరుకొండ మండల పరిధిలోని గుండ్లగుంటపల్లి,నర్సంపల్లి బూతు నెంబర్ 271లో నరేంద్ర మోడీ ప్రభుత్వం గత పదియేండ్ల పాలనలో ప్రజలకు చేరువయ్యే అభివృద్ధి పథకాలు జాతీయ ఉపాధి హామీ పథకం కింద పేద ప్రజలకు 330 రూపాయలు దినసరి కూలి పెంచిన ఘనత నరేంద్ర మోడీ ప్రభుత్వందేనని తెలిపారు. రాబోయే కాలంలో ఈ దేశాన్ని ముందుకు తీసుకుపోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారని, మళ్ళీ మూడోసారి నరేంద్ర మోడీ ప్రభుత్వం రావాలని ప్రజలకు వివరించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ గౌడ్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు కుడుముల శ్యాంసుందర్ రెడ్డి, వెంకట్ నర్స్, నరేందర్ గౌడ్, శ్రీధర్ గౌడ్, బాలస్వామి గౌడ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు గడ్డం మహేందర్, రాఘవేందర్, తిరుపతి రెడ్డి, ఆనంద్ గౌడ్, రాజునారం రెడ్డి, తిరుమలేష్ , శంకరయ్య, ఖయ్యూం, తదితరులు పాల్గొన్నారు.